- కనుపూరు, సర్వేపల్లి రిజర్వాయర్ల నుంచి గ్రావెల్ తరలింపుపై విచారణ
- ఎమ్మెల్యే సోమిరెడ్డి ఫిర్యాదుతో ప్రభుత్వ నిర్ణయం
- అత్యవసరంగా నివేదిక పంపాలి : సీఎంవో ఆదేశం
- నాడు విచ్చలవిడిగా వైసీపీ నేతల దోపిడీ
- ఇరిగేషన్ అధికారులను బెదిరించి మరీ అక్రమాలు

# తవ్విందెంత.. తిన్నదెంత ?

వైసీపీ ప్రభుత్వంలో జరిగిన గ్రావెల్ అక్రమాలపై కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. నాడు జరిగిన దోపిడీపై విచారణ జరిపి, వేగంగా నివేదికను అందజేయాలని ఆదేశించింది. కనుపూరు చెరువు, సర్వేపల్లి రిజర్వాయర్లలో జరిగిన గ్రావెల్ తవ్వకాలపై సమగ్ర విచారణ జరపాల్సిందిగా ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి ఇరిగేషన్ శాఖకు ఉత్తర్వులు అందాయి. దీంతో ఇరిగేషన్ శాఖ అధికారులు తాజాగా విచారణ ప్రారంభించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఫిర్యాదుతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

-నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



కనుపూరు చెరువులో గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన భారీ గుంతలు

వైసీపీ ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా మట్టి, గ్రావెల్ దోపిడీ జరిగింది. కనుపూరు చెరువు, సర్వేపల్లి రిజర్వాయర్‌లను కుళ్లపొడిచారు. రైతుల పేరుతో తవ్వకాలకు అనుమతులు తీసుకోవడం, అనంతరం ఆ మట్టి, గ్రావెల్‌ను నెల్లూరు పరిసరప్రాంతాల్లో ఉన్న లేఅవుట్ల, పరిశ్రమలకు విక్రయించి రూ.కోట్లు గడించారు. అప్పట్లో ఈ తవ్వకాలపై ఎన్ని ఆరోపణలు వచ్చినా, చివరకు స్థానికులు అడ్డుకున్నా అక్రమార్కులు వెనక్కు తగ్గలేదు. సుమారు ఐదేళ్లపాటు విచ్చలవిడిగా దోపిడీ చేశారు. ఈ అక్రమాలపై గత ఏడాది ఆగస్టులో అప్పటి ప్రతిపక్షనేత, ప్రస్తుత సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సీఎంకి ఫిర్యాదు చేశారు. కానీ ఎవరూ పట్టించుకోలేదు. అయితే గత నెలలో మరోసారి సోమిరెడ్డి సీఎంకి ఫిర్యాదు చేశారు. కనుపూరు చెరువు, సర్వేపల్లి రిజర్వాయర్లల్లో 15 లక్షల క్యూబిక్ మీటర్లకుపైగా గ్రావెల్, మట్టి దోపిడీ జరిగిందని, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇందులో రూ.40 కోట్లు అక్రమంగా సంపాదించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో స్పందించిన సీఎంవో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ సెక్రటరీ సాయిప్రసాద్‌ను ఆదేశించింది. ఆయన ఇరిగేషన్ ఈఎన్‌సీ, నెల్లూరు ఇరిగేషన్ ఎస్‌ఈలకు ఆదేశాలు పంపారు. ఈక్రమంలో కనుపూరు చెరువు, సర్వేపల్లి రిజర్వాయర్లల్లో జరిగిన అక్రమ తవ్వకాలపై విచారణ ప్రారంభమైంది.

**● అధికారులకు బెదిరించి అక్రమాలు**

గతంలో ఎన్నడూ లేనివిధంగా వైసీపీ ప్రభుత్వంలో ఇరిగేషన్ అధికారులను బెదిరించి, భయపెట్టి చెరువులు, రిజర్వాయర్లల్లోని మట్టి, గ్రావెల్‌ను కొల్లగొట్టారు. పొలాలను సారవంతంగా

- మిగతా 6లో



నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్ తదితరులు

# మార్చి నాటికి రైల్వే పనుల పూర్తి

**● దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్**


నెల్లూరు వెంకటేశ్వరపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు 2025 మార్చి కల్లా పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. బుధవారం ఆయన ప్రత్యేక రైలులో జిల్లా పర్యటనకు వచ్చారు. ముందుగా రైల్వే అధికారులతో కలసి ట్రాక్ స్పీడ్ టెస్టింగ్ చేశారు. అనంతరం నెల్లూరు ప్రధాన స్టేషన్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యతలో ఎక్కడా కూడా రాజీ లేకుండా నిర్మాణాలు చేపట్టాలన్నారు. 2025 మార్చికి పనులు పూర్తి చేసేలా దిశానిర్దేశం చేశారు. జీఎం వెంట పలువురు రైల్వే ఉన్నతాధికారులు, తదితరులు ఉన్నారు.



పుడమి తల్లినే నమ్ముకున్న అన్నదాతను కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. విత్తు దశ నుంచి కోత వరకు సాంకేతికపరంగా రైతులకు వెన్నుదన్నుగా నిలవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ద్వారా క్షేత్రస్థాయిలో రైతులను ఆదుకునేలా మార్గదర్శకాలు రూపొందించాయి. అయితే, గత కొన్నేళ్లుగా 'ఆత్మ'కు నిధుల కేటాయింపులు తగ్గిపోతున్నాయి. ఇంకేముంది ఈ వ్యవస్థ ఆశించిన స్థాయిలో రైతులకు వెన్నుదన్నుగా నిలవడం లేదు.

- నెల్లూరు వ్యవసాయం, (ఆంధ్రజ్యోతి)

# 'ఆత్మ' ఘోషిస్తోంది !



- నిధుల లేమితో పథకం నిర్వీర్యం
- నామమాత్రంగానే కార్యకలాపాలు
- కూటమి ప్రభుత్వంపైనే రైతుల ఆశలు

రైతులకు సాంకేతిక పరమైన సలహాలు, శిక్షణ తరగతులు, అవగాహన కార్యక్రమాలతోపాటు సరికొత్త పరిజ్ఞానం అందించేందుకు 2006లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఆత్మ'ను ప్రారంభించాయి. 60-40 శాతం నిష్పత్తిలో నిధులు మంజూరు చేస్తూ పథకాన్ని అమలు చేయాలని అప్పటి పాలకులు నిర్ణయించారు. ఆ మేరకు 2018 వరకు పూర్తిస్థాయిలో రైతులకు సేవలందించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంబంధించి ఒక వ్యవసాయ సబ్ డివిజన్‌కు ఒక బ్లాక్ టెక్నికల్ మేనేజర్ (బీటీఎం), ఇద్దరు అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్లు (ఏటీఎం) ఉండాలి. అయితే ప్రస్తుతం 12 బీటీఎంలకుగాను నలుగురు, 24 మంది ఏటీఎంలకు ముగ్గురు మాత్రమే అందుబాటులో ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఆత్మకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు చేయకపోవడంతో కేంద్రం నుంచి సైతం నిధులు నిలిచిపోయాయి.

**● నామమాత్రంగా సదస్సులు**

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో దాదాపు 10లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయి. దాదాపుగా 4లక్షల మంది రైతులకు వ్యవసాయమే జీవనాధారం. వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానంతోపాటు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు ఎంతో అవసరం. అంతేగాక అధిక వర్షాలు, వర్షాభావ పరిస్థితుల్లో ఏయే కార్యక్రమాలు చేపట్టాలో రైతులకు అవగాహన కల్పించడంలో ఆత్మ ఎంతో కీలకంగా వ్యవహరించేది. అయితే, 2019 నుంచి పథకానికి బడ్జెట్ కేటాయింపుల్లో కోతలు విధించడంతో ఆయా కార్యక్రమాలు నామమాత్రంగా నిర్వహించేవారు. గత రెండేళ్లలో పరిశీలిస్తే కేవలం రూ.5లక్షలు

- మిగతా 6లో



మొబైల్ హంట్ ద్వారా స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు

# సెల్ చేజారితే...!

- 'మొబైల్ హంట్'తో రికవరీ
- ఏడు విడతల్లో మూడువేల సెల్‌ఫోన్ల స్వాధీనం
- వాటి విలువ సుమారు రూ. 8 కోట్లు
- సెల్ పోయిందా... 91543 05600 నెంబరుకి వాట్సప్ చేయండి

నెల్లూరు క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నేడు మొబైల్ ఫోన్ మనిషి జీవితంలో నిత్యావసర వస్తువుగా మారింది. పేద, ధనిక అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ కనిపిస్తున్నది. ఈ క్రమంలో సెల్‌ఫోన్ నెంబర్‌ను ప్రభుత్వ పథకాల కోసం వచ్చే మెసేజ్‌లు, మెయిల్, ఆన్‌లైన్ లావాదేవీలకు వినియోగిస్తున్నారు. పదికాలాలు గుర్తుండే ఫొటోలు తీయాలన్నా, వాటిని భద్రపరచాలన్నా సెల్‌ఫోనే సాధనం... ఇలా అన్నీ పనులకు సెల్‌ఫోనే అవసరం. అసలు మనిషి మెదడును ఉపయోగించడం మానేసి పూర్తిగా సెల్‌ఫోన్‌పైనే ఆధారపడ్డాడు. ఈ నేపథ్యంలో సెల్‌ఫోన్ చేజారిపోతే ఆ బాధ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. అయితే, సెల్‌ఫోన్‌పోతే నేనున్నానంటూ పోలీసులు తీసుకువచ్చిన మొబైల్ హంట్ ఉపయోగపడుతున్నది. చోరీకి గురైన సెల్‌ఫోన్లను ఈ యాప్ రికవరీ చేస్తున్నది.

**● ఫిర్యాదు చేయడం ఎలా..?**

గతంలో సెల్‌ఫోన్ పోతే పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే పోలీసులు వారికున్న పెద్ద కేసులతో పట్టించుకునేవారు కాదు. అయితే, మొబైల్ హంట్ సేవలు అందుబాటులోకి వచ్చాక పోలీసుస్టేషన్‌కు వెళ్లకుండా, ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా, కేవలం వాట్సప్ మెసేజ్‌ల ద్వారా జిల్లా పరిధిలో చోరీకి గురైన, మిస్ అయిన సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేసి బాధితులకు అందిస్తున్నారు. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన వాట్సప్ నెంబరు 9154305600కు ఫోన్ చేస్తేనే అది నెల్లూరు జిల్లా పోలీసు పేరున వెబ్‌లింక్ పంపుతుంది. ఆ లింక్‌ను క్లిక్ చేయగానే గూగుల్ పేజీ ఓపెన్ అవుతుంది. ఆ పేజీలో ఫిర్యాదుదారుడి పేరు, చిరునామా, సెల్‌ఫోన్ పోయిన తేదీ, సమయం, ప్రదేశాన్ని తెలియజేయాలి. మొబైల్ పోయిన విధానం గురించి చెప్పాలి. ఫిర్యాదుదారుడి పోలీసుస్టేషన్ పరిధి తెలియజేసి సెల్‌ఫోన్ కొనుగోలు చేసిన బిల్లు లేక, బాక్స్‌పైన ఉన్న ఐఎంఐ నెంబర్లను నమోదు చేసి సబ్‌మిట్ చేయాలి. దీంతో మన ఫిర్యాదు నమోదు అవుతుంది. అనంతరం పోలీసులు విచారణ చేపట్టి మిస్‌అయిన, లేదా చోరీ అయిన ఫోన్‌ను కనుగొంటారు. ఇలా ఇప్పటివరకు జిల్లాలో ఏడు విడతల్లో సుమారు రూ. 8 కోట్ల విలువ చేసే మూడువేల సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేసి బాధితులకు అప్పగించారు.

**చోరీ మొబైళ్లు కొనుగోలు చేయొద్దు**

మొబైళ్లను దొంగలించిన వ్యక్తులు మార్కెట్లో తక్కువ ధరకు వాటిని విక్రయిస్తుంటారు. దీంతో చాలామంది అత్యుత్సాహంతో వాటిని కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి వారిలో యువత విద్యార్థులు, గ్రామీణులు అధికంగా ఉంటున్నారు. ఈ క్రమంలో మొబైల్ పోగొట్టుకున్న వ్యక్తి మొబైల్ హంట్‌లో ఫిర్యాదు చేయడంతో దాన్నిప్రస్తుతం వాడుతున్న వ్యక్తి నుంచి పోలీసులు రికవరీ చేస్తున్నారు. ఈ క్రమంలో దొంగలించిన ఫోన్‌ను ఎందుకు కొనుగోలు చేశారంటూ పోలీసులు గట్టిగా ప్రశ్నిస్తున్నారు. కాబట్టి ఎవరూ బిల్లులు లేని, తక్కువ ధరకు వస్తున్నాయన్న ఆశతో చోరీకి గురైన మొబైళ్లను కొనుగోలు చేసి ఇబ్బందులు తెచ్చుకోవద్దని పోలీసులు సూచిస్తున్నారు.

### యాప్‌ను సద్వినియోగం చేసుకోండి



సెల్‌ఫోన్ పోగొట్టుకున్నవారు మొబైల్ హంట్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే పలు దఫాలుగా ఫోన్లు పోగొట్టుకున్న మూడువేలమందికి మొబైల్ హంట్ ద్వారా రికవరీ చేసి అందించాం.

- జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

### ఫోన్ దొరుకుతుందని ఊహించలా ?



ఇంటి వరండాలో కూర్చొని ఫోన్ మాట్లాడి ఇంటి లోపలికి వెళ్లి వచ్చేసరికి నా ఫోన్ చోరీకి గురైంది. అయితే పోయిన ఫోన్ ఏం దొరుకుతుందేలే.. అని కొద్ది రోజులు దాన్ని గురించి వదిలేశా. నా మిత్రుడు మొబైల్ హంట్‌కు ఫిర్యాదు చేయమని చెబితే నవ్వుకున్నా. ఎట్టకేలకు అతని ఒత్తిడితో మొబైల్ హంట్‌కు ఫిర్యాదు చేశా. ఆరు నెలలు గడవక ముందే పోలీసుల నుంచి నాకు ఫోన్ వచ్చింది. నీ ఫోన్ దొరికింది వచ్చి తీసుకెళ్లమన్నారు. ఇప్పటికీ నమ్మలేకున్నాను. నిజంగా మొబైల్ హంట్ సేవలు అద్భుతం.

- జీ మధుబాబు, ఉలవపాడు

# ఇంటర్ విద్యార్థులకూ ప్రోగ్రెస్ కార్డులు

- ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా చర్యలు
- తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు
- ఈ ఏడాది నుంచే అమలులోకి..


ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగునకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డుల విధానం అమలు చేసేలా ఆదేశాలు జారీ చేసింది. ఈ నూతన విధానంతో విద్యార్థులు పరీక్షల్లో సాధిస్తున్న మార్కులు, వారి ప్రగతి తల్లిదండ్రులకు తెలియజేయడం ద్వారా మంచి ఫలితాల సాధనకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.


- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)

ఇంటర్ ఫలితాల్లో 'కార్పొరేట్'కు దీటుగా ప్రభుత్వ కళాశాలలనూ తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలల్లో ప్రోగ్రెస్ కార్డుల విధానం అమలు చేస్తున్నారు. విద్యార్థుల హాజరు, అంతర్గత పరీక్షల్లో వారు సాధించిన మార్కుల వివరాలు సదరు కార్డుల్లో నమోదు చేయనున్నారు. తల్లిదండ్రులకు చూపించి వారితో సంతకాలు చేయించి కళాశాలకు తెచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే ఇంటర్‌లో నెలకు ఒకటి చొప్పున నాలుగు యూనిట్ పరీక్షలు, త్రైమాసికం, అర్ధ సంవత్సరం, ప్రీ ఫైనల్ పరీక్షలు రెండుసార్లు నిర్వహిస్తారు. వృత్తి విద్యా కోర్సులు చదివే విద్యార్థులకు తెలుపు, జనరల్ ప్రథమ సంవత్సరం చదివే విద్యా ర్థులకు లేత పసుపు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు లేత నీలం రంగుల్లో కార్డులు సిద్ధం చేస్తున్నారు. హాజరు వివరాలు నమోదు చేయనుండటంతో విద్యార్థులు సక్రమంగా కళాశా లలకు వెళుతున్నారా లేదా అన్న విషయాలు తల్లిదండ్రులకు తెలిసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే కార్డుల నమూనాలను అధికారులు జూనియర్ కళాశాలలకు పంపించారు. వీటిని అమలు చేయాల్సిన తీరుపై ప్రిన్సిపాళ్లకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి ప్రోగ్రెస్ కార్డుల గురించి తెలియచేస్తూ వీటిని తప్పక అనుసరించాలని సూచనలు జారీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

| యాజమాన్యం | కళాశాలలు |
|---|---|
| ప్రభుత్వం | 24 |
| ఎయిడెడ్ | 2 |
| మోడల్ | 11 |
| ఏపీఎస్‌డబ్ల్యుఆర్ | 6 |
| కేజీబీవీ | 12 |
| హైస్కూల్ ప్లస్ | 16 |
| ప్రైవేట్ అన్ ఎయిడెడ్ | 116 |
| మొత్తం | 187 |

| విద్యార్థుల సంఖ్య | |
|---|---|
| జూనియర్లు : | 28,297 |
| సీనియర్లు : | 24,706 |
| మొత్తం : | 53,003 |








ఇంటర్ విద్యార్థులకు అందజేసే ప్రోగ్రెస్ కార్డుల ఇవే!

**ఉత్తమ ఫలితాలకు దోహదం**

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రోగ్రెస్ విధానం ఎంతో దోహదం చేస్తుంది. ఈ ఏడాది నిర్వహించే ప్రతి పరీక్షకు సంబంధించిన వివరాలు, హాజరుశాతం ప్రోగ్రెస్ కార్డుల్లో నమోదు చేసి తల్లిదండ్రులకు పంపిస్తారు. దీంతో విద్యార్థుల వివరాలు, వారి పరిస్థితి అధ్యాపకులకు, తల్లిదండ్రులకు ముందుగానే తెలుస్తాయి. దీని ఆధారంగా వారిని బాగా చదివించి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేస్తాం.

- డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు, ఆర్ఐవో



బాధ్యతలు స్వీకరిస్తున్న పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తదితరులు

# దినేష్‌రెడ్డి ప్రమాణ స్వీకారం

**అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి**

నెల్లూరు(హరనాథపురం)/బుచ్చిరెడ్డిపాలెం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పోలంరెడ్డి దినేష్‌రెడ్డి బుధవారం విజయవాడలో ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు స్వీకరించారు. ఆర్‌అండ్‌బీ శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, దినేష్‌రెడ్డితో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎండీ ఫరూక్, వక్ఫ్‌బోర్డు చైర్మన్, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, సర్వేపల్లి, కోవూరు, ఉదయగిరి, గూడూరు ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కాకర్ల సురేష్, పాశం సునీల్‌కుమార్, ఎమ్మెల్సీలు రాంభూపాల్‌రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, మారిటైల్ కార్పొరేషన్ చైర్మన్ దామచర్ల సత్య, పొల్యూషన్ బోర్డు చైర్మన్ పీ.కృష్ణయ్య, కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గూటూరు కన్నబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దినేష్‌రెడ్డిని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డితోపాటు పలువురు అభినందించి, శుభాకాంక్షలు తెలియచేశారు. దినేష్‌రెడ్డి ప్రమాణస్వీకారానికి బుచ్చి నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కాగా ఈ సందర్భంగా బుచ్చిరెడ్డిపాలెంలో నేతలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

## పెద్ద స్టేషన్‌లో కొత్త అండర్‌పాస్






నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో తూర్పు వైపు నూతనంగా నిర్మించిన అండర్‌పాస్ వాడుకలోకి వచ్చింది. ఇప్పటి వరకు పడమర వైపు నుంచి రెండు, మూడు ప్లాట్‌ఫాంల వరకు మాత్రమే భూగర్భంలో అండర్‌పాస్ ఉండేది. అయితే రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి కోసం రూ.102 కోట్లతో చేపట్టిన పనుల్లో భాగంగా తూర్పు వైపు నుంచి కొత్త అండర్ పాస్ నిర్మించి అన్ని ప్లాట్ ఫాంలకు వెళ్లేలా అనుసంధానించారు. కాగా, మరమ్మతుల కోసం తూర్పువైపు మెట్లమార్గాన్ని తాత్కాలికంగా మూసివేశారు. పనులు పూర్తయ్యాక మెట్లమార్గం కూడా అందుబాటులోకి వస్తుందని స్టేషన్ సూపరింటెండెంట్ శివయ్య తెలిపారు.

- నెల్లూరు (వెంకటేశ్వరపురం, ఆంధ్రజ్యోతి)

## పైపులైను పగిలి కుంగిన రోడ్డు!



కావలి పట్టణ పరిధిలోని విట్స్ కళాశాల వెనుకవైపున రోడ్డు మలుపు వద్ద మంగళవారం అర్ధరాత్రి మంచినీటి ప్రధాన పైపులైన్ పగిలి రోడ్డుకు రంధ్రం పడి కుంగిపోయింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు స్తంభించడంతోపాటు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి ప్రధాన పైపులైన్ నుంచి పట్టణంలోని ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీరు వదలిన సమయంలో ఈ పైపులైను పెద్దపవని రోడ్డు నుంచి ఉదయగిరి రోడ్డులోకి ప్రవేశించే మలుపు వద్ద పగలడంతో రోడ్డు కూడా కుంగాపోయింది. కాగా పెద్దపవని రోడ్డులో కలుగోళ్లశాంబవి ఆలయం వద్ద ఆర్వోబీ వంతెన నిర్మాణం ఆగిపోవడంతో ఆమార్గంలో నడిచే వాహనాలను పెద్ద పవని రోడ్డు నుంచి ఉదయ గిరి రోడ్డు వైపు మళ్లిస్తూ ఒక రహదారిని నిర్మించారు. అయితే ఆ రహదారిలో ఉదయగిరి రోడ్డు మలుపు వద్ద పైపులైన్ పగిలి రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో వాహనాలను మినీ స్టేడియం లోపల నుంచి ఉదయగిరి రోడ్డు వైపు మళ్లించారు. అయితే అక్కడ కూడా మినీ స్టేడియం నుంచి ఉదయ గిరి రోడ్డులోకి ప్రవేశించే వద్ద ఉన్న మురుగునీటి కాలువ కల్వర్టు కుంగి వాహనచోదకులు ఇబ్బందులకు గురవడంతో కల్వర్ట్ కుంగిన చోట గ్రావెల్ నింపి వాహనాల రాకపోకలు కొనసాగించారు. మంచి నీటి ప్రధాన పైపులైన్ పగిలిన కారణంగా పట్టణంలోని కోఆపరేటీవ్ కాలనీ, మున్సిపల్ కార్యాలయం, వెంగళరావునగర్, వైకుంఠపురం, కచ్చేరిమిట్ట ప్రాంతాల్లో ఉన్న ఓవర్‌మెడ్ ట్యాంకులకు నీటి సరఫరా ఆగిపోయింది.

- కావలి,(ఆంధ్రజ్యోతి)



జిల్లాలో అస్తవ్యస్తంగా నిర్వహణ

ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్రీడాకారులు

# ప్రశ్నార్థకంగా వర్సిటీ కళాశాలల క్రీడలు

నెల్లూరు (విద్య), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం(వీఎస్‌యూ) నిర్వహిస్తున్న అంతర్ కళాశాలల క్రీడలు ప్రశ్నార్థకంగా మారాయి. మూడేళ్లుగా ఇదే రీతిన జరుగుతుండడంతో క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతర్ కళాశాలల క్రీడాపోటీల నిర్వహణ, యూనివర్సిటీ జట్ల ఎంపికల షెడ్యూల్ గందరగోళంగా మారడంతో క్రీడాకారులు అయోమయానికి గురవుతున్నారు. కొన్ని కళాశాలలకు మాత్రమే లబ్ధి చేకూరేలా పోటీల నిర్వహణ చేస్తుండడంతో తాము క్రీడా ప్రయోజనాలు పొందలేకపోతున్నామని విద్యార్థులకు ఆందోళన చెందుతున్నారు.

● నిర్వహణ అధ్వానం

వీఎస్‌యూ అంతర్ కళాశాలల క్రీడల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మహిళా అంతర్ కళాశాలల పోటీల నిర్వహణకు పొంతన లేని షెడ్యూల్ ప్రకటించడంతో గందరగోళం నెలకొంది. తొలుత ఈ పోటీల తేదీలను ఈనెల 17, 18వతేదీల్లో నిర్వహిస్తామని వర్సిటీ అధికారులు ప్రకటించారు. అయితే వర్షాల కారణంగా ఈ తేదీలను రద్దు చేశామని నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తామని తెలియచేసిన ఒక్కరోజులోనే తిరిగి 19, 20వతేదీల్లో నిర్వహిస్తామని ప్రకటించారు. దీంతో క్రీడాకారులు, కళాశాలల నిర్వాహకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాలల్లోని క్రీడాకారులకు ముందస్తు సమాచారం లేకుండా, సమయం కూడా ఇవ్వకుండా ఒక్కరోజులోనే పోటీలకు హాజరు కావాలని ప్రకటించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులు పోటీలకు హాజరు కావడం ఇబ్బందిగా ఉంటుందని, కనీసం తేదీలు ప్రకటించిన తరువాత రెండు, మూడు రోజులైనా సమయం ఇవ్వకుండా హడావుడిగా నిర్వహిస్తున్నారని పలువురు పీడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో 19వతేదీ నుంచి నిర్వహిస్తానన్న ప్రకటించిన తేదీలను కూడా హడావుడిగా సోమవారం రాత్రి మార్పు చేశారు. గతంలో కబడ్డీ పోటీలను కూడా అకస్మాత్తుగా ఈనెల 10వతేదీ(ఆదివారం)సెలవు రోజున నిర్వహించడంతో నామమాత్రంగా క్రీడాకారులు హాజరయ్యారని, ప్రతిభ కలిగిన క్రీడాకారులకు నష్టం జరిగిందని చెబుతున్నారు. అలగప్ప యూనివర్సిటీలో మహిళా అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలు ఈనెల 29వతేదీ నుంచి జరుగుతుండగా అన్ని క్రీడలతో పాటు అంతర్ కళాశాలల షెడ్యూల్ ప్రకారం నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ ఒక్క కబడ్డీ క్రీడనే ప్రత్యేకంగా నిర్వహించడం అనుమానాలకు తావిస్తోందంటున్నారు.

● కొన్ని కళాశాలలకే ప్రయోజనం

యూనివర్సిటీ పరిధిలోని 150 కళాశాలల్లోని క్రీడాకారులకు ప్రయోజనం కలిగించేలా రూపొందించాల్సిన షెడ్యూల్‌ను కొన్ని కళాశాలలకే ప్రయోజనం కలిగేలా కొంతమంది సిబ్బంది వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. యూనివర్సిటీలో క్రీడా సాంకేతిక పరిజ్ఞానం లేని వ్యక్తులను క్రీడా ప్రతినిధులుగా నియమించడం, వారికి కొన్ని కళాశాలల ఫిజికల్ డైరక్టర్‌లు తమకు అనుకూలంగా ప్రయోజనం పొందేలా సూచనలు, సలహాలు ఇవ్వడంతోనే యూనివర్సిటీ పరిధిలోని అత్యధిక కళాశాలల్లో విద్యార్థులు క్రీడా ప్రయోజనాలను పొందలేకపోతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు, యూనివర్సిటీ ఉన్నతాధికారులు దృష్టి సారించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



ఇటీవల జరిగిన కబడ్డీ పోటీలు

## 'ఆత్మ' ఘోషిస్తోంది !

(5వ పేజీ తరువాయి)

మాత్రమే బడ్జెట్ కేటాయింపులు జరిపినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో అవగాహన సదస్సులు, శిక్షణ కార్యక్రమాలు నామమాత్రంగా నిర్వహించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని సందర్భాల్లో జీతాలు కూడా సమయానికి అందక అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడ్డారు.

● పూర్తిస్థాయిలో నిధులు కేటాయించేనా..?

గత తెలుగుదేశం పార్టీ హయాంలో (2014-19) ఆత్మ పథకానికి పూర్తిస్థాయి నిధులు కేటాయించేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతుల్లో ఆనందం నెలకొంది. సాంకేతిక పరమైన విజ్ఞాన యాత్రలు, అవగాహన సదస్సులు, శిక్షణతోపాటు క్షేత్రస్థాయి సందర్శనలకు పూర్తిస్థాయి బడ్జెట్ కేటాయింపులు జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇప్పటికే బడ్జెట్ సమావేశాల్లో వ్యవసాయ రంగానికి దాదాపు రూ.180 కోట్ల మేర కేటాయింపులు జరిగాయి. సాంకేతిక పరిజ్ఞానం అందరికీ అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో ఆత్మ పథకానికి పూర్తిస్థాయిలో బడ్జెట్ కేటాయింపులు జరుగుతాయని రైతులు ఆశగా ఉన్నారు.

### సాంకేతిక పద్ధతులు తెలియజేస్తున్నాం



వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ద్వారా రైతులకు సాంకేతిక పద్ధతులను తెలియజేస్తున్నాం. కేవీకే వాళ్లతో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శనలు చేస్తూ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నాం. గతేడాది దాదాపు రూ.6.5 లక్షల బడ్జెట్ కేటాయించగా, ఉమ్మడి నెల్లూరు జిల్లా కిందే ఆత్మ కార్యక్రమాలు సాగిస్తున్నాం. ఉన్న నిధులతో రైతులకు అవసరమైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపులు, మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

- శివన్నారాయణ, పీడీ, ఆత్మ

## అమెరికాలో మన ఆటగాడు

● ఫ్లోరిడా రాష్ట్రంలో ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా రోహన్

● బెస్ట్‌ప్లేయర్ అవార్డు కైవసం

ఫ్లోరిడాలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో విన్నర్‌గా నిలిచిన టీమ్‌లో.. (ఇన్‌సర్ట్‌లో) రోహన్ కుమార్






సంగం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో మూడురోజుల క్రితం రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో అండర్ -14 విభాగంలో పాల్గొన్న సంగం గ్రామానికి ప్రవాస భారతీయ విద్యార్థి వాగిశెర్ల రోహన్‌కుమార్ ప్రతిభ కనబరచి బెస్ట్ ప్లేయర్‌గా నిలిచాడు. సంగం గ్రామానికి గునుపూడి గిరి, విజయలక్ష్మి దంపతుల కుమార్తె, కుమారుడు అమెరికాలో ఉన్నారు. కుమార్తె పేరు స్రవంతి.ఆమెకు 12 ఏళ్ల క్రితం అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా ఉన్న కావలికి చెందిన వాగిశెర్ల కల్యాణ్ చక్రవర్తితో వివాహమైంది. వారికి రోహన్ కుమార్, ప్రేమ్‌కుమార్ సంతానం. రోహన్‌కుమార్ వయసు 11ఏళ్లు. అమెరికలో ఆరో తరగతి చదువుతున్నాడు. తండ్రి కల్యాణ్ చక్రవర్తి క్రికెట్ క్రీడాకారుడు కావడంతో రోహన్‌కుమార్ ఫుట్‌బాల్ ప్లేయర్ శిక్షణ ఇచ్చాడు. దీంతో అతను ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా రాణిస్తున్నాడు. చిన్న కుమారుడు ప్రేమ్‌కుమార్ కూడా క్రికెట్ క్రీడాకారుడు.




బెస్ట్‌ప్లేయర్ కప్పు అందుకున్న రోహన్‌కుమార్‌తో తండ్రి, తాత

● రాష్ట్రస్థాయిలో ప్రతిభ

ఈ నేపథ్యంలో ఇటీవల రోహన్ కుమార్ అండర్-14 కేటగిరిలో ఫుట్‌బాల్ విభాగంలో స్కూల్ స్థాయిలో ప్రతిభ కనబరి జాక్సెన్ విల్లి జిల్లా స్థాయి టీమ్‌లో ఎంపికయ్యాడు. మూడు రోజుల కిందట ఫ్లోరిడాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రోహన్ కుమార్ ప్రతిభ కనబరచడంతో జాక్సెన్ విల్లి టీమ్ రాష్ట్రస్థాయిలో విన్నర్‌గా నిలిచింది. టీమ్ గెలవడానికి కీలక గోల్ చేసిన రోహన్ కుమార్‌ను అక్కడి అధికారులు బెస్ట్ ప్లేయర్‌గా ప్రకటించారు. అమెరికాలోనూ తన అల్లుడు కల్యాణ్ చక్రవర్తి, మనవళ్లు రోహన్ కుమార్, ప్రేమ్‌కుమార్‌లు క్రీడాకారులుగా రాణించడం పట్ల సంగంలోని గునుపూడి గిరి కుటుంబం హర్షం వ్యక్తం చేసింది.

## అడవిలో పేలిన నాటుబాంబు

● ఆవుకు తీవ్ర గాయాలు

● రెండు నాటుబాంబుల స్వాధీనం



నాటు బాంబు పేలుడులో గాయపడిన ఆవు

మనుబోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడమనూరు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో బుధవారం నాటుబాంబు పేలింది. దీంతో గోవు దవడకు తీవ్ర గాయమైంది. పొలాల్లోకి అటవీ ప్రాంతం నుంచి వచ్చే పందులు, జింకల కోసం నాటుబాంబులు వాడుతుంటారు. బాంబుల వద్ద ఆహారం వేయడంతో జంతువులు వాటిని ముట్టగానే అవిపేలుతాయి. దీంతో జంతువులు అక్కడికక్కడే కుప్పకూలుతాయి. వాటి మాంసాలు విక్రయించి సొమ్ము చేసుకుంటారు. ఇలాంటి సంఘటలే గతంలో చెర్లోపల్లి పొలాల్లో, మడమనూరు ఎరుకల కాలనీ సమీపంలో జరిగాయి. కాగా మడమనూరుకు చెందిన ద్వారకయ్య అనే రైతు పంటపొలాల్లో వ్యవసాయపనులు జరుగుతుండడంతో తన గోవులను మేతకోసం అటవీప్రాంతానికి తోలుకెళ్లాడు. మేతమేసే ప్రయత్నంలో ఓ గోవు బాంబును తాకడంతో అదిపేలిపోయింది. భయంకర శబ్దం రావడంతో రైతు దాని దగ్గరకి పరిగెత్తుకు వచ్చాడు. అప్పటికే గోవు దవడకు తీవ్ర రక్తగాయమైంది. ఆ సమీపంలో రైతు ఉండి ఉంటే ఆయనకు ప్రమాదం జరిగి ఉండేది. సమాచారం అందుకున్న ఎస్ఐ. శివరాకేష్ ఆ ప్రాంతానికి చేరుకుని బాంబు పేలిన ప్రదేశాన్ని పరిశీలించారు. సమీపంలో ఉన్న పేలని రెండు నాటు బాంబులను స్వాధీనం చేసుకున్నారు. త్వరలోనే బాంబులు అమర్చిన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారం రోజులుగా జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రజా పౌరసంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ సదారావు, నెల్లూరు ప్రజా సైన్స్ వేదిక పట్టణ అధ్యక్షుడు సతీష్‌కుమార్ హాజరయ్యారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన చెస్, వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ, క్విజ్ పోటీల విజేతలైన బాలబాలికలకు బహుమతులు అందజేశారు. ముందుగా చిన్నారులు నిర్వహించిన కూచిపూడి నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో పేరు నమోదైన సాగర్ తన యోగాసనాలతో అబ్బురపరిచాడు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా పాల్గొన్నారు. గ్రంథాలయ సిబ్బందిని సన్మానించారు.

## తవ్విందెంత.. తిన్నదెంత ?

(5వ పేజీ తరువాయి)

చేసుకునేందుకుగాను చెరువులు, రిజర్వాయర్లల్లో మట్టిని క్యూబిక్ మీటర్ రూపాయి చొప్పున తీసుకెళ్లేందుకు ప్రభుత్వం జీవో ఇచ్చింది. ఆ జీవోను అడ్డంపెట్టుకొని కొందరు వైసీపీ నేతలు రైతుల ముసుగులో అక్రమాలకు పాల్పడ్డారు. నిబంధనల ప్రకారం తవ్వకాలకు అనుమతి తీసుకునే రైతు తన పొలం వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. మట్టి తవ్వకాలు జరిగాక అనుమతి మేరకే జరిగాయా.. లేదా..? అన్నది ఇరిగేషన్ అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. అయితే గత ప్రభుత్వంలో ఇవేమి జరగలేదు. సంబంధం లేని పొలాలకు మట్టి అవసరం అంటూ తెల్లకాగితాలపై దరఖాస్తులు చేసి అధికారులను భయపెట్టి అనుమతులు తీసుకోవడం జరిగాయి. వెయ్యి క్యూబిక్ మీటర్లకు అనుమతులు తీసుకుంటే పదివేల క్యూబిక్ మీటర్లకుపైగా తవ్వినట్లు ఆరోపణలు ఉన్నాయి. అఖరకు అప్పటి ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పేరుపై కూడా ఆయనకు తెలియకుండానే మట్టి తవ్వకాలకు అనుమతులు పొందడం అప్పట్లో పెద్దదుమారమే రేగింది. క్యూబిక్ మీటర్‌కు రూపాయి చొప్పున ఎవరు డీడీలు కట్టి అనుమతులు పొందారు..!?, ఆ పొలంలోకే మట్టి, గ్రావెల్ తోలేరా..!?, అన్నది విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### రికార్డులు అప్పగిస్తున్నాం

కనుపూరు చెరువు, సర్వేపల్లి రిజర్వాయర్లల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఇచ్చిన ప్రొసీడింగ్స్ కాపీలను అందించాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశించారు. సర్కిల్ పరిధిలో ఇచ్చిన అనుమతుల వివరాలను నేను పంపించాను. డివిజన్ స్థాయిలో ఇచ్చిన అనుమతుల వివరాలు అందించాలని ఈఈకి సూచించాం.

- ఇరిగేషన్ శాఖ ఎస్ఈ దేశానాయక్

## కృష్ణపట్నం పంచాయతీ నిధుల దుర్వినియోగం

● ఇద్దరు గ్రామ కార్యదర్శుల సస్పెన్షన్

ముత్తుకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కృష్ణపట్నం పంచాయతీ నిధుల దుర్వినియోగంలో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను బుధవారం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. 2021 ఏప్రిల్ నుంచి 2024జూలై వరకు పనిచేసిన ఇద్దరు గ్రామ పంచాయతీ కార్యదర్శులు టీ రాజశేఖర్,బీ మస్తానయ్యను సస్పెండ్ చేశారు. పంచాయతీ పరిధిలో సాధారణ నిధులు, 14, 15 వ ఆర్థిక సంఘం నిదులు దుర్వినియోగమయ్యాయని అధికారులు విచారణలో ధ్రువీకరించారు. గత వైసీపీ హయాంలో అప్పటి వైసీపీ నాయకులు, సర్పంచును అడ్డంపెట్టుకుని అడ్డగోలుగా నిధులు స్వాహాచేశారు. 2021ఏప్రిల్ నుంచి జూన్ 2023వరకు కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో రూ.1.70కోట్లు దుర్వినియోగం చేశారని, రూ. 2.40కోట్లు అభ్యంతరకరంగా ఖర్చుచేశారని నివేదికలో పేర్కొన్నారు. 2023 జూన్ నుంచి 2024జూలై వరకు కార్యదర్శి మస్తానయ్య ఆధ్వర్యంలో రూ.1.47కోట్లు అభ్యంతరకరంగా ఖర్చు చేశారని, రూ. 20లక్షలు దుర్వినియోగం చేశారని నివేదికలో తెలిపారు. వైసీపీ పాలనలో జరిగిన నిధుల దుర్వినియోగంపై టీడీపీ అధికారంలోకి రాగానే స్థానిక నాయకులు డీపీవోకి, కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు విచారణలో నిధుల దుర్వినియోగం వాస్తవమేనని తేలడంతో ఇద్దరు కార్యదర్శులను సస్పెండ్ చేశారు. రాజశేఖర్ ప్రస్తుతం కోటమండలం కొత్తపట్నం పంచాయతీ కార్యదర్శిగా, మస్తానయ్య ముత్తుకూరు మండలంలోనే నేలటూరు కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు వీరిద్దరిని ఆయా స్థానాల నుంచి వెళ్లకూడదని ఆదేశించారు.

## మద్యం దుకాణం తొలగించండి

● విద్యార్థుల నిరసన

నెల్లూరు(క్రైం),నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని పరమేశ్వరి నగర్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలంటూ బుధవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. వాకర్స్ రోడ్డులోని పరమేశ్వరి నగర్ మెయిన్ రోడ్డులో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని నినదించారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం కలుగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆ ప్రాంతం నుంచి వైన్ షాప్‌ని తొలగించాలని డిమాండ్ చేశారు.



మద్యం దుకాణం తొలగించాలంటూ నిరసన తెలుపుతున్న విద్యార్థులు

## ఘరానా దొంగ అరెస్టు

● తాళం వేసిన ఇళ్లే లక్ష్యం ● రూ. 5.6 లక్షల సొత్తు స్వాధీనం

నెల్లూరు(క్రైం),నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాత్రి పూట తాళం వేసిన ఇళ్లని టార్గెట్ చేసి పక్కాగా రెక్కీ నిర్వహించి చాకచక్యంగా సర్వం దోచుకెళ్లే ఘరానా దొంగను బాలాజీనగర్ పోలీసులు ఎట్టకేలకు బుధవారం అరెస్టు చేశారు. నిందితుడి వివరాలను నెల్లూరు నగర డీఎస్పీ డీ శ్రీనివాస రెడ్డి బాలాజీనగర్ పోలీసుస్టేషన్‌లో మీడియాకు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం రాయవేలూరు జిల్లా వసంతపురం గ్రామానికి చెందిన మారీ రంజిత్ కుమార్ వ్యసనాలకు బానిసై దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నాడు. చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో వరుస చోరీలకు పాల్పడ్డాడు. నెల్లూరులోని బాలాజీనగర్ గుర్రాల మడుగు సంఘంలో అద్దూరి విజయకుమారి తన కుమార్తెతో కలిసి ఓ రేకుల ఇంట్లో నివసిస్తోంది. ఆ ఇంటి పక్కనే కొత్తగా భవనం నిర్మించుకున్నారు. ఈనెల 14వతేదీ రేకుల ఇంటికి తాళం వేసి నూతన భవనంలో నిద్రపోయారు. 15వతేదీ ఉదయం రేకుల ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపల బీరువాలో ఉండాల్సిన బంగారు, వెండి ఆభరణాలు మాయమయ్యాయి. దీంతో ఆమె బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కే సాంబశివరావు సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతికత, ఇతర ఆధారాలతో తమిళనాడుకు చెందిన రంజిత్ కుమార్‌ని నిందితుడిగా గుర్తించారు. నగరంలోని చిల్డ్రన్స్ పార్కు ప్రాంతంలో అతడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. తమదైన శైలిలో విచారించగా బాలాజీనగర్, వేదాయపాళెం పోలీసుస్టేషన్లతోపాటు చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోనూ అనేక దొంగతనాలకు పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడు. అతని వద్ద నుంచి రూ.5.44 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, రూ.16 వేల విలువ చేసే వెండిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరచిన సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



మీడియాకు వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

# పంట పొలం కాదండీ.. మలిదేవి వాగు..!



పచ్చగా కళకళలాడుతున్న ఇది పంట పొలం అనుకుంటే పొరపాటే.. బుచ్చిరెడ్డిపాళెం సమీపంలోని కనిగిరి రిజర్వాయర్ నుంచి ఊటుకూరు సమీపంలో బంగాళా ఖాతం వరకు ఉన్న మలిదేవి వాగు. ఈ వాగులో కోవూరు-కొడవలూరు మండలాల మధ్య ఇలా గుర్రపుడెక్కతో నిండిపచ్చగా దర్శనమిస్తోంది. గత ఏడాది వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.కోటి వెచ్చించి మలిదేవి వాగు ఆధునికీకరణ పనులు చేపట్టారు. కంట్రాక్టరు తూ.తూ. మంత్రంగా పనులు చేపట్టడంతో ఏడాది తిరక్కుండానే మలిదేవి వాగు గుర్రపుడెక్కతో నిండిపోయింది. దీంతో కనిగిరి రిజర్వాయర్ పరిధిలోని పంట పొలాల నుంచి వృథా నీరు వెలుపలికి పోవడం ఇబ్బందిగా తయారైంది. ఈ పర్యాయమైనా గుర్రపుడెక్కను సమూలంగా తొలగించి వృథా నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చేయాలని రైతులు కోరుతున్నారు.

- కోవూరు,(ఆంధ్రజ్యోతి)

# ఆలయానికి వెళ్లాలంటే అడుసు తొక్కాల్సిందే

మండలంలోని దువ్వూరమ్మ ఆలయానికి వెళ్లాలంటే అడుసు తొక్కాల్సిందే. ఇది వందల సంవత్సరాల ఆలయం. ఆ దేవత పేరుతోనే దువ్వూరు గ్రామం ఏర్పడింది. ఆలయం ఊరికి ఎగువ భాగంలో పొలాలకు వెళ్లే దారిలో ఉంది. ఈ దారిలోనే దేవదాయ శాఖకు చెందిన కోటేశ్వరాలయం ఉంది. గతంలో గ్రామం నుంచి కోటేశ్వరాలయం వరకు సిమెంట్ రోడ్డువేశారు. నిధులు సరిపోకపోవడంతో నిలిపేశారు. ఆతరువాత ఎవరూ పట్టించుకోలేదు. వర్షం వస్తే సుమారు 400 మీటర్ల దూరం బురదమయంగా మారుతోంది. దీంతో వర్షాకాలంలో ఆలయానికి వెళ్లాలంటే బురద తొక్కుకుంటూ వెళ్లాల్సి వస్తోందని, అధికారులు స్పందించి సిమెంట్ రోడ్డు వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)





## బాలలు హక్కుల రక్షణకు పోరాడాలి

● లోక్‌అదాలత్ న్యాయమూర్తి వాణి



ర్యాలీని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి వాణి

నెల్లూరు(విద్య), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బాలలు తమ హక్కులకు భంగం కలిగితే వాటిని ఎదుర్కోవడమేకాక సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని లోక్ అదాలత్ న్యాయమూర్తి టీ వాణి సూచించారు. అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలల హక్కులపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించి వారికి రక్షణ కల్పించాలన్నారు. జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, భాగస్వామ్యపు హక్కు, అభివృద్ధి చెందే హక్కు తదితరాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆర్‌ఐవో డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు మాట్లాడుతూ బాలల విద్య, హక్కుల పరిరక్షణ, బావవ్యక్తీకరణ హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం 1300 మంది విద్యార్థినులు, సిబ్బందితో ర్యాలీ చేపట్టారు. కళాశాల నుంచి కేవీఆర్ పెట్రోలు బంకు కూడలి వరకు ర్యాలీ సాగింది. అక్కడ మానవహారం ఏర్పాటు చేసి బాలల హక్కులపై నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, డీసీపీవో సురేష్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ గౌస్, సీడీపీవో లక్ష్మీదేవి, పీవో సమత, దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ చెంచురామారావు తదితరులు పాల్గొన్నారు.

## డాబాలపై పోలీసుల దాడులు



డాబాలో తనిఖీ చేస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా డాబాలపై పోలీసులు మంగళవారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. డాబాల్లో మద్యం విక్రయాలు, మద్యం సేవిస్తున్నారన్న దానిపై పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ఎస్పీ జీ కృష్ణకాంత్ మాట్లాడుతూ హోటళ్లలో, డాబాల్లో మద్యం విక్రయించడం, సేవించేలా అనుమతించడం నిషిద్ధమన్నారు. మద్యం సేవించేందుకు డాబాలు అనుమతిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం నిషేధమని, మద్యం సేవిస్తూ బెదిరింపులకు పాల్పడే ఆకతాయిలపై కేసులు నమోదు చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతుంటే ప్రజలు 112 నెంబరుకుగానీ, స్థానిక పోలీసుస్టేషన్‌కుగానీ సమాచారం అందించాలని కోరారు.

## విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు



శ్రీ వెంకటేశ్వరరెడ్డి (ఫైల్)

సంగం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న శ్రీవెంకటేశ్వరరెడ్డి (16) అనే విద్యార్థి అదృశ్యంపై బుధవారం సంగం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. స్థానిక తిరుమనతిప్ప కాలనీకి చెందిన విద్యార్థి అవ్వ గడ్డం విజయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శ్రీవెంకటేశ్వరరెడ్డి తల్లి మృతిచెందగా అవ్వ, తాత ఇంట్లో ఉండి చదువుకుంటున్నాడు. ఈనెల 14వ తేదీ సాయంత్రం ట్యూషన్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి రాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వృద్ధుడి మృతి



మృతి చెందిన గుర్తుతెలియని వృద్ధుడు

కోవూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారిపై మండలంలోని రామన్నపాలెం రైల్వేగేటు సమీపంలో బుధవారం వేకువజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు (70) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నగరం వైపునకు నడచి వెళ్తున్న ఆ వృద్ధుడిని అదే మార్గంలో వెళ్తున్న వాహనం ఢీకొంది. దీంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు రెండు చొక్కాలు ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న కోవూరు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి దుర్మరణం



మృతిచెందిన తోపుగుంట హజరత్తయ్య

చేజర్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం ఉదయం చేజర్ల మండలంలోని బొగ్గలవారి కండ్రిక గ్రామంలో చోటుచేసుకుంది. చేజర్ల ఎస్‌ఐ ప్రభాకర్ వివరాల మేరకు... పాడేరు గ్రామానికి చెందిన తోపుగుంట హజరత్తయ్య (55) వ్యవసాయం చేసుకుంటూ మోటార్ మరమ్మతు పనులు కూడా చేస్తుండేవాడు. ఈక్రమంలో బుధవారం హజరత్తయ్య బొగ్గలవారి కండ్రిక సమీపంలో మోటార్ మరమ్మతు చేస్తూ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

### చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో |
|---|---|
| బాయిలర్ లైవ్ | 110 |
| లేయర్ లైవ్ | 110 |
| స్కిన్ చికెన్ | 206 |
| స్కిన్‌లెస్ | 230 |
| లేయర్ | 187 |

### బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ.7289 |
| వెండి కిలో ధర | రూ. 92,300 |
| వెండి ఒక గ్రాము | రూ.95.30 |

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందలపాడు క్రాస్ రోడ్డు సమీపంలో వడ్డిపాళెం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నగరంలోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన ఇబ్రహీం, సుభాన్‌లు మోటర్ సైకిల్‌పై ఇస్లాంపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా చింతలపాళెం గ్రామం దాటిన తర్వాత వడ్డిపాళెం వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్ల వద్ద బైక్ అదుపుతప్పి పడింది. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కసుమూరులోని ఓ ప్రైవేటు క్లీనిక్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రాయితీ సూక్ష్మపోషకాలు అందేనా!?

భూమిలో సూక్ష్మపోషకాల లోపం ఉంటే పంట దిగుబడి తగ్గిపోతుంది. భూసార పరీక్షల ఆధారంగా ఆయా లోపాలను గుర్తించి జింకు, జిప్సం, బోరాన్ వంటి సూక్ష్మపోషకాలను వినియోగించాలి. దీంతో ఎరువుల వాడకం తగ్గి రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి. గత టీడీపీ హయాంలో ఆయా సూక్ష్మపోషకాలు 50 శాతం సబ్సిడీతో అందించగా, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాయితీ ఎత్తివేయడమేగాక సరఫరా పూర్తిగా ఆపేసింది. దీంతో ప్రైవేటు దుకాణాల్లో సూక్ష్మపోషకాలు కొనుగోలు చేస్తుండటంతో రైతులకు పెట్టుబడి వ్యయం పెరిగిపోయింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తిరిగి సూక్ష్మపోషకాలకు రాయితీ కల్పించి పెట్టుబడి భారం తగ్గించాలని కర్షకులు కోరుతున్నారు.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)



● పూర్తిగా ఆపేసిన గత వైసీపీ సర్కారు
● అన్నదాతలపై అదనపు భారం
● కూటమి ప్రభుత్వం అమలు చేయాలంటున్న రైతులు

జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి దాదాపు 4.5 లక్షల ఎకరాల్లో వరి, మరో యాభై వేల ఎకరాల్లో వేరుశనగ, మినుము తదితర పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా. అయితే, జిల్లాలోని వ్యవసాయ భూముల్లో 78 శాతం జింకు, 73 శాతం బోరాన్, 24శాతం ఇనుము, 13.48 శాతం మాంగనీసు, 21శాతం రాగి, 10శాతం సల్ఫర్ తక్కువ మోతాదులో ఉన్నట్లు భూసార పరీక్ష కేంద్రం అధికారులు చెబుతున్నారు. క్రమం తప్పకుండా జిప్సం, పచ్చిరొట్ట ఎరువులు వినియోగించాలని కూడా సూచిస్తున్నారు. ఆయా లోపాలను నివారించేందుకు జింకు, జిప్సం, బోరాన్ వంటి సూక్ష్మ పోషకాలు ఎంతో అవసరం. అయితే, గత వైసీపీ సర్కారు వీటి సరఫరాను నిలిపేయడంతో రైతులు ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేసుకునే పరిస్థితి నెలకొంది. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో 50శాతం రాయితీపై సూక్ష్మపోషకాలు రైతులకు అందేవి. అంతేగాక 2018-19లో దాదాపు వందశాతం రాయితీపై 1,635 మెట్రిక్ టన్నుల జింకు, 9209 మెట్రిక్ టన్నుల జిప్సం అందించింది. దుక్కిదున్నే సమయంలో భూసార పరీక్ష ఫలితాల ద్వారా ఎంతశాతం జింకు లోపం ఉందో గుర్తించి జింకు ఎంత వినియోగించాలో వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తారు. ఎకరాకు దాదాపుగా అవసరాన్ని బట్టి 10 నుంచి 20కేజీల జింకు వినియోగిస్తారు. మార్కెట్‌లో రూ.400 నుంచి 600 వరకు ధర పలుకుతోంది. అదేవిధంగా జింకు లోపం కారణంగా ఆకుల మధ్య భాగం పసుపు రంగులోకి మారి మొక్కలు గిటకబారిపోతాయి. దీనివల్ల దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయి. దీని నివారణకు జిప్సం వినియోగిస్తారు. 20కేజీల బస్తా దాదాపు రూ.600 నుంచి రూ.700 వరకు ధర ఉంది. బోరాన్ లోపం ఏర్పడితే ఆకులు ఎర్రగా మారిపోతాయి. బోరాన్ పూత దశలో ఎంతో కీలకంగా పని చేస్తుంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ సూక్ష్మపోషకాలను కూటమి ప్రభుత్వం రాయితీపై అందించి పెట్టుబడి భారం తగ్గించాలని రైతులు కోరుతున్నారు.

### ఎలాంటి ప్రకటన లేదు



సూక్ష్మపోషకాలు రైతులకు ఎంతో అవసరం. భూసార పరీక్ష ఫలితాల ద్వారానే ఏ భూమిలో ఏ సూక్ష్మధాతువు లోపం ఉందో గుర్తించడం జరుగుతుంది. ఫలితాల నివేదికను బట్టి రైతులకు సూచనలిస్తాం. అయితే రాయితీపై సూక్ష్మపోషకాల పంపిణీకి ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన ప్రకటన రాలేదు. రైతులు కోరితే రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటాం.

- పీ.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

### సోమశిలకు 6,790 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి బుధవారం 6,790 ఇన్‌ఫ్లో వస్తోంది. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 70.698 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 50, కండలేరుకు తెలుగుగంగ ద్వారా 3,000, ఉత్తర కాలువకు 550, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

### విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్‌గా నరసింహారావు



బాధ్యతలు స్వీకరిస్తున్న నరసింహారావు

నెల్లూరు (క్రైం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్‌గా నరసింహారావు బుధవారం విజిలెన్స్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 1996 బ్యాచ్‌కి చెందిన ఆయన జిల్లాలోని చిన్నబజారు, వేదాయపాళెం, వాకాడు, నాయుడుపేట టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు.

### ఆర్టీసీ జోనల్ చైర్మన్‌గా సురేష్‌రెడ్డి నేడు బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్‌గా నియమితులైన నన్నపురెడ్డి సురేష్‌రెడ్డి గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నారు.

## రైతు ఉత్పత్తి సంఘాలకు రాయితీ

● లేగుంటపాడులో కలెక్టర్ ఆనంద్



ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

కోవూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో ప్రభుత్వం అందించే రాయితీల్లో రైతు ఉత్పత్తి సంఘాలకు ప్రాధాన్యతనిస్తామని కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. మండలంలోని లేగుంటపాడులో రైతు ఉత్పత్తిదారుల సంఘం కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. సంఘాల ఆధ్వర్యంలో రైతులు పండించిన పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. రైతు ఉత్పత్తి సంఘాలకు సహకారం అందించనున్నట్లు వివరించారు. పండించిన పంటలను ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. ప్రగతి యువకేంద్రం ఆధ్వర్యంలో నడుస్తున్న రైతు ఉత్పత్తిదారుల సంఘం సోలార్ కోల్డ్‌రూమ్, డీ హైడ్రేషన్ యూనిట్, కలెక్షన్ సెంటర్లను ఆయన పరిశీలించారు. ఆయన వెంట జిల్లా ఉద్యానవన శాఖాధికారి సుబ్బారెడ్డి, నాబార్డు అధికారి బాబు, తహసీల్దారు నిర్మలానందబాబ, మండల వ్యవసాయ శాఖాధికారి ఇందిరావతి, ఉద్యానవనశాఖాధికారి ప్రసన్న తదితరులు ఉన్నారు.

## కస్తూర్బా విద్యాలయాల్లో పోస్టుల భర్తీ



నియామక ఉత్తర్వులు అందిస్తున్న డీఈవో బాలాజీరావు

నెల్లూరు(విద్య), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న నాన్‌టీచింగ్ స్టాఫ్ పోస్టులను భర్తీ చేసినట్లు డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు తెలిపారు. ఆ పోస్టులకు ఎంపికైన వారికి బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నియమాక ఉత్తర్వులు అందచేసి మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా కస్తూర్బా బాలిక విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 14 నాన్‌టీచింగ్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. ఇందులో 8 అసిస్టెంట్ కుక్ పోస్టులు, స్వీపర్ ఒకటి, స్కావెంజర్స్ పోస్టులు 2, వాచ్‌మన్ పోస్టులు 2 కలిపి మొత్తం 13 పోస్టులకు ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులు అందచేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ సీహెచ్ ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

## సహకార సంఘాల పాత్ర కీలకం

● సహకార వారోత్సవాల ముగింపు సభలో జేసీ కార్తీక్



సహకార వారోత్సవ సభలో మాట్లాడుతున్న జేసీ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 20 : ఆర్థిక అసమానతలు లేని వికసిత భారత నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర ఎంతో కీలకమని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అన్నారు. కలెక్టరేట్ తిక్కన భవన్‌లో 71వ సహకార వారోత్సవ ముగింపు సభ బుధవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ వికేంద్రీకరణ ద్వారా మాత్రమే అభివృద్ధి సాధ్యమన్నారు. జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు డిజిటలైజేషన్ ప్రక్రియ ఎంతగానో దోహదపడుతుందన్నారు. పాడి పరిశ్రమ, మత్స్య సంబంధ రంగాల్లో బహుళ ప్రయోజన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలన్నారు. డీసీవో గురప్ప మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా అన్నీ సహకార సంఘాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో డీఎల్‌సీవో సుధా భారతి, డీసీసీబీ సీఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## రాత్రంతా రికార్డుల పరిశీలన

ఉదయగిరి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి సబ్‌ట్రెజరీ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ శిరీష ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు రికార్డుల పరిశీలన చేపట్టారు. ఉదయగిరి ఖజానా కార్యాలయ ఉప ఖజానా అధికారి సీహెచ్ మమత అరియర్స్ బిల్లు కోసం ఉపాధ్యాయుడు లోకసాని వెంగయ్యను రూ.40 వేలు లంచం డిమాండ్ చేసింది. లంచం ఇవ్వడం ఇష్టంలేక వెంగయ్య ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈనేపథ్యంలో మంగళవారం ఎస్టీవో సూచించిన వ్యక్తికి వెంగయ్య నగదు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు రాత్రంతా కార్యాలయంలో వివిధ బిల్లుల మంజూరుకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం బుధవారం ఉదయం 8 గంటలకు ఆమెను అదుపులోకి తీసుకుని నెల్లూరుకు తరలివెళ్లారు.



## 9 మద్యం సీసాల స్వాధీనం

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ సెంటర్‌లో నిర్వహిస్తున్న మద్యం బెల్టు దుకాణంపై బుధవారం ఉదయగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్‌ఐ దీప్తికరంత్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు ఏలూరి చెంచయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## శ్రీవారి పాదాల ఆలయంలో చిత్రపటాల దహనం



బిట్రగుంట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట, తాళ్లూరు గ్రామ పంచాయతీల మధ్య అటవీ ప్రాంతంలోని పురాతన శ్రీవారి పాదాల ఆలయంలో స్వామి,అమ్మవార్ల చిత్రపటాలను బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేశారు. మధ్యాహ్నం ఆలయం నుంచి పొగలు రావడాన్ని గుర్తించిన భక్తులు దగ్గరికి వెళ్లి చూసేసరికి స్వామి, అమ్మవార్ల చిత్రపటాలు, పూజాసామగ్రి, కొన్ని పుస్తకాలను గుట్టగా వేసి తగులపెట్టి ఉన్నారు. వాటిని చూసి భక్తులు ఆవేదన చెందారు. మతకలహాలు సృష్టించేందుకే కొందరు ఇలా చేశారని భక్తులు ఆరోపిస్తున్నారు.

## అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు


సమావేశంలో మాట్లాడుతున్న సత్యవాణి

కందుకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎరువుల నిల్వల రికార్డులలో తేడాలున్నా, ఎంఆర్‌పీకి మించి అధిక ధరకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవ సాయాధికారిణి పి సత్యవాణి హెచ్చరించారు. బుధవారం సాయంత్రం కందుకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎరువుల డీలర్లు, విత్తన డీలర్లతో ఆమె స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నిరకాల ఎరువులు ఎంఆర్‌పీ ధరకే విక్రయించాలని, రైతులకు రసీదు ఇవ్వాలని, నోటీసు బోర్డులో ఏరోజుకారోజు అమ్మకపు రేట్లు, ఎరువుల నిల్వల వివరాలు నమోదు చేయాలని నిర్దేశించారు. ఎక్కడైనా నిబంధనలు అతిక్రమించినా, రైతుల వద్ద అధిక ధరలు వసూలుచేసినా చర్యలు కఠినంగా ఉంటాయని తెలిపారు. లైసెన్సులు తీసుకున్న అన్ని పీఏసీఎస్‌లలో ఎరువులు అందుబాటులో ఉంచేలా తక్షణం చర్యలు తీసుకోవాలని స్థానిక వ్యవసాయాధికారులకు ఆమె ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో కందుకూరు ఏడీఏ పి అనసూయ, జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయం ఏడీఏలు ఏ నర్సోజీరావు, ముత్యాల శేషగిరి, ఏఓలు వి రాము, టీ హేమంత్ భరత్‌కుమార్, టీ అబ్రహం లింకన్, వి రవికుమార్, జె తిరుమలజ్యోతి, ఎరువుల డీలర్లు, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

## పరమానంద ఆశ్రమంలో ప్రశాంత వాతావరణం

● త్రిదండి రామానుజ చినజీయర్‌స్వామి


వసతి గదులను ప్రారంభిస్తున్న చినజీయర్‌స్వామి

కలువాయి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పినాకిని నది ఒడ్డున రాజుపాళెం సమీపంలో ఉన్న పరమానంద ఆశ్రమంలో ప్రశాంతమైన వాతావరణం ఉందని త్రిదండి రామానుజ చినజీయర్‌స్వామి అన్నారు. తోటపల్లిగూడూరు మండలం పాపిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ దాతలు మారంరెడ్డి మహేష్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు రూ.20లక్షల ఆర్థిక సాయంతో ఆశ్రమంలో నిర్మించిన ఆరు వసతి గదుల సముదాయాన్ని బుధవారం చినజీయర్ స్వామి ప్రారంభించారు. ఆశ్రమంలోని వేద పాఠశాల విద్యార్థుల కోసం తరగతి గది నిర్మాణానికి చినజీయర్‌స్వామి రూ.5లక్షలు సాయం అందజేసినట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలి

● ఆత్మ పీడీ శివనారాయణ

వలేటివారిపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకే రైతులు పురుగుమందులు వినియోగించాలని నెల్లూరు జిల్లా ఆత్మ పీడీ డాక్టర్ శివనారాయణ సూచించారు. మండలంలోని పోకూరు రైతు సేవా కేంద్రంలో బుధవారం ఏఓ హేమంత్ భరత్‌కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా శివనారాయణ మాట్లాడుతూ రైతులు సాంకేతిక పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని, రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని తెలిపారు. జిల్లా జలవనరుల కేంద్రం వ్యవసాయాదికారి డాక్టర్ శైలజాకుమారి మాట్లాడుతూ మినుము పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహయ సంచాలకులు శ్రీకాంత్‌రెడ్డి, ఖాదర్‌బాషా రైతులు పాల్గొన్నారు.

### సూక్ష్మ సేద్య రాయితీ పథకాలపై అవగాహన

సంగం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతు సేవాకేంద్రం వీఏఏలకు సూక్ష్మ సేద్య పథకాలపై ఉద్యానశాఖాధికారి శ్రీలక్ష్మి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిందు, తుంపర్ల నీటి సాగు పథకాలపై ప్రభుత్వ నూరుశాతం రాయితీ ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫ్లోరోసిస్‌పై ప్రజలకు అవగాహన


ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దివ్య

సీతారామపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పబ్బులేటిపల్లి గ్రామ పంచాయతీలో డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో బుధవారం ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఈసందర్భం గా జిల్లా ఫ్లోరోసిస్ వైద్య అధికారి దివ్య మాట్లాడుతూ తాగునీటిలో ఫ్లోరిన్ అధిక స్థాయిలో ఉండటం వలన ప్రజలు ఫ్లోరోసిస్ బారిన పడతారని తెలిపారు. అంతేకాకుండా అన్నం మట్టి, స్టీలు పాత్రలలో వండాలని సూచించారు. పాలు, పెరుగు, కాల్షియం ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తినాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఫ్లోరోసిస్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, ఎంపిహెచ్‌ఓ మజీద్, రియాజ్, శేఖర్‌రాజు, తిరుపాల్ రెడ్డి, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న లేఅవుట్లలో అక్రమాలపై విచారణ జరపాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే ఇంటూరి



కందుకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గంలో జగనన్న లేఅవుట్లలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని, సమ్మర్ స్టోరేజీ ట్యాంకు సమీపంలో వరాల సాయినగర్ లేఅవుట్‌లో అక్రమాలకు పాల్పడ్డారని ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. బుధవారం అసెంబ్లీలో ఆయన జగనన్న లే అవుట్లలో అక్రమాలను ప్రస్తావించి వరాల సాయినగర్ గురించి ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిగ్గుతేల్చాలని, జగనన్న లే అవుట్లలో జరిగిన అక్రమాలన్నింటినీ వెలుగులోకి తేవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## రూ.5 కోట్లు వెచ్చిస్తే 30 వేల కుటుంబాలకు తాగునీరు

● అసెంబ్లీలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



జలదంకి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాలకు రూ.26 కోట్లతో రూపుదిద్దుకున్న ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకానికి గత వైసీపీ ప్రభుత్వంలో గ్రహణం పట్టిందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ బుధవారం అసెంబ్లీలో వివరించారు. ప్రస్తుతం ఈ పథకానికి రూ.5కోట్లు ఖర్చు చేస్తే నియోజకవర్గంలోని 30 వేల కుటుంబాలకు శుద్ధి జలాలు అంది ప్రజలు ఫ్లోరైడ్ సమస్య నుంచి బయట పడతారని కోరారు. దీనికి స్పందించిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మెట్టప్రాంతం అయిన ఉదయగిరితో పాటు రాష్ట్రంలో నిలిచిపోయిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని తిరిగి కొనసాగించి రాష్ట్ర ప్రజలకు శుద్ధి చేసిన తాగునీటిని అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



## వారమైనా వదలని వర్షపు నీరు

● జలదిగ్బంధంలో చుట్టుగుంట రోడ్డు
● వాహనదారుల అవస్థలు


చుట్టుగుంట రోడ్డులో చప్టాపై ప్రవహిస్తున్న వర్షపునీరు

కందుకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వర్షం తెరపిచ్చి వారంరోజులు గడిచినా కందుకూరు - చుట్టుగుంట రోడ్డు జలదిగ్బంధంలోనే ఉంది. 167బీ జాతీయ రహదారిలో కందుకూరు బైపాస్ రోడ్డుకు ఇరువైపులా ఈ మార్గంలో వాగులు పొంగుతూ చుట్టుపక్కల పొలాలు సరస్సులా మారటంతో నేలచప్టాలపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని చుట్టుగుంట- కంద్రా వారిపాలెం, ఆత్మకూరు, మన్నేటికోట గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఈనెల 12న వర్షం ప్రారంభమైంది మొదలు ఈ రహదారిలో ఐదు రోజులపాటు రాకపోకలు స్తంభించిపోయాయి. వర్షం తెరపిచ్చి వారం రోజులైనా వాగులు మూడు అడుగుల లోతున ప్రవహిస్తుండటంతో బుధవారం కూడా మోటారుసైకిళ్లపై ప్రయాణించలేని పరిస్థితి నెలకొంది. మరోపక్క మోకాటిలోతు గుంతలతో శిథిలమై ఉన్న నేలచప్టాలపై 3అడుగుల మేర నీరు ప్రవహిస్తుండటంతో మోటారుసైకిళ్లు, కార్లు కూడా ఈ గుంతలలో పడే ప్రమాదం ఉంది. ముమ్మరంగా వ్యవసాయ పనుల సీజన్ కావటంతో ఎరువులు, పురుగుమందుల కోసం, ఇతర అవసరాల కోసం మోపెడ్‌లపై కందుకూరు వెళ్లక తప్పటం లేదని, అయితే ఈ మార్గంలో వెళ్లే అవకాశం లేక 4 కిలోమీటర్లు చుట్టుతిరిగి ఆనందపురం మీదగా వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. వాగును పూర్తిగా ఆక్రమించేయటం ఈ పరిస్థితికి కొంత కారణమైతే హైవే నిర్మాణం వల్ల కూడా నీరు సాఫీగా వెళ్లలేక నిల్వ ఉంటున్నదని, మరో పదిరోజులు కూడా పరిస్థితి ఇలాగే ఉండేలా ఉందని ఈలోగా మళ్లీ వర్షం కురిస్తే నెలలతరబడి మాకు ఈ తిప్పలు తప్పవని ఆ నాలుగు గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. వాగు ఆక్రమణలను జేసీబీలతో తొలగించి నీరు వేగంగా ప్రవహించేలా చూడటంతో పాటు ఇక్కడ హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టడం ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

## ఉపాధి హామీ పథకం లక్ష్యాలను సాధించాలి : ఎంపీడీవో


ఆత్మకూరు: సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఆత్మకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం లక్ష్యాలను సాధించేందుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది కృషిచేయాలని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీలో పనులు జరిగేలా చర్యలు తీసుకొని కొలతల ప్రకారం పనిచేయించి రూ. 300 వేతనం పొందేలా అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏపీవో, టీఏలు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

●ఉదయగిరి రూరల్ : ఉపాధి హామీ సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం అధిగమించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పాజీ సూచించారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హార్టికల్చర్, ఇంకుడు గుంతల తవ్వకాల లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో ప్రతిఒక్కరికి ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. పనుల వద్ద కూలీ లకు వసతులు కల్పించడంతోపాటు వారు సమయపాలన పాటించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసరాజు, ఏపీవో శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

●లింగసముద్రం: గత నెల 2వ తేదీన జరిగిన ఉపాధిహామీ గ్రామసభలో గుర్తించిన పనులకు ఆమోదం తెలిపినట్టు ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంటు జి రాఘవ తెలిపారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచు పి రాఘవులు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో ఇంకుడుగుంతల నిర్మాణం, గోకులం షెడ్లు ఏర్పాటు, పంట కాలువలో పూడికతీత పనులు మొదటి ప్రాధాన్యతగా చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం మాధవరావు, ఎఫ్ఏ సీహెచ్ రమేష్, టీడీపీ నేతలు ఎ రంగయ్య, జి ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

## ఆపార్ నమోదులో జిల్లాను ముందంజలో ఉంచాలి


ఆత్మకూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఖాజామొహిద్దీన్

ఆత్మకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉర్దూ పాఠశాలల్లో విద్యార్థుల ఆపార్ నమోదును వేగవంతం చేయాలని జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజా మొహిద్దీన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక ఉర్దూ ప్రైమరీ కాంప్లెక్స్ సమాశాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపార్‌ను వేగవంతం చేసి జిల్లాను ముందంజలో ఉంచాలన్నారు. ఉర్దూ ప్రైమరీ కాంప్లెక్స్ సమావేశాల అజెండాలో ఉన్న విద్యా ప్రవేశ్, ఎఫ్ఎల్ఎన్ తదితర అంశాల గురించి ఉపాధ్యాయులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఆర్పీలు జిలానీ బాష, నాయబ్ జానీ, అల్‌తాఫ్ భగత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సముదాయ సమావేశాల తనిఖీ

ఉదయగిరి రూరల్: పాఠశాల సముదాయ సమావేశాలు అజెండా ప్రకారం నిర్వహించాలని ఉర్దూ పాఠశాలల జిల్లా ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజామొహిద్దీన్ సూచించారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉర్దూ ప్రైమరీ పాఠశాల సముదాయ సమావేశాలను తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో రిసోర్సుపర్సన్‌లు కరీంఖాన్, ఇనయితుల్లా, శంషాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులకు శిక్షణ

సీతారామపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. టీఎస్ఎస్ సర్వే, తదితర అంశాలపై ఎంఈవో మస్తాన్‌వలి ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ వైస్ చైర్మన్ రామకృష్ణంరాజు, ఆర్పీలు రవిచంద్ర, శ్రీనివాసులు, మహేష్, లక్ష్మయ్య, గోడ్లవేటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### బోధనలో మెలకువలు మెరుగుపరచుకోవాలి

కొండాపురం : ఉపాధ్యాయులకు జరిగే కాంప్లెక్స్ సమావేశాలలో పాఠ్యాంశ బోధనలో మెలకువలు మెరుగుపరచుకునేందుకు అవకాశం ఉంటుందని ఎంఈవో-2 ఆనందరావు పేర్కొన్నారు. తూర్పుఎర్రబల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన ప్రైమరీ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అలాగే కొండాపురంలోని జడ్పీ ఉన్నతపాఠశాలలో జరిగిన కాంప్లెక్స్ సమావేశాన్ని ఆయన పరిశీలించారు.

## టీడీపీ సభ్యత్వ నమోదు


అంకభూపాలపురం ఎస్టీ కాలనీల్లో టీడీపీ సభ్యత్వం చేయిస్తున్న నాయకులు

వలేటివారిపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకభూపాల పురం ఎస్టీ కాలనీల్లో టీడీపీ నాయకులు ప్రగడ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం కూడా కొనసాగింది. ఈసందర్భంగా మోహన్‌కుమార్ టీడీపీ సభ్యత్వం వలన ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బక్కమంతుల ప్రసాద్, ప్రగడ ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీవో బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న దయాకర్

ఉదయగిరి రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ ట్రెజరీ ఇన్‌చార్జి ఉప ఖజానా అధికారిగా యడవల్లి దయాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్టీవో సీహెచ్ మమత ఓ ఉపాధ్యాయుడికి సంబంధించిన అరియర్స్ బిల్లు మంజూరు విషయమై నగదు డిమాండ్ చేసింది. అతను ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో వారు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఉన్నతాధికారులు వింజమూరు సబ్‌ట్రెజరీ ఎస్టీవో దయాకర్‌ను ఇన్‌చార్జి ఎస్టీవోగా నియమిస్తూ ఆదేశాలు జారీచేశారు.

## రైల్వే పరిశ్రమ ఏర్పాటు చేయండి


రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు లోకోషెడ్ చిత్రపటాన్ని అందచేస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు

బిట్రగుంట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బిట్రగుంటలో నిరుపయోగంగా ఉన్న రైల్వే భూముల్లో రైల్వే పరిశ్రమ ఏర్పాటు చేయాలని బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు షేక్.నూరుద్దీన్, మెతుకు రాజేశ్వరి, బీ.రవిచంద్ర, జహీర్, సుభానిలు దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను కోరారు. బుధవారం ప్రత్యేక రైల్లో తిరుపతి జిల్లా గూడూరు పర్యటనకు వచ్చిన ఆయన తిరుగు ప్రయాణంలో బిట్రగుంటలో ఆగడంతో ఆయనను కలసి సన్మానించి లోకోషెడ్ చిత్రపటం అందచేశారు. బిట్రగుంట నుంచి తిరుపతికి మెమూ రైలు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందచేశారు. స్పందించిన ఆయన బిట్రగుంట ప్రాంతంలో ఆర్వోహెచ్ ఏర్పాటు చేసేవిధంగా స్థల పరిశీలన చేపడుతామని జీఎం చెప్పారని వారు తెలిపారు. అలాగే బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, రైల్వే విశ్రాంత ఉద్యోగులు గోవిందరాజులు, విజయరాజు, భాగ్యరాజు, అంతోనిరాజ్, రాజన్నలు నెల్లూరు రైల్వే స్టేషన్లో జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను కలిసి బిట్రగుంట అభివృద్ధిపై వినతిపత్రం అందచేశారు. కొవిడ్ సమయంలో బిట్రగుంటలో కొన్ని రైళ్ల స్టాపింగ్ ఎత్తివేయడంతో రైల్వే విశ్రాంత ఉద్యోగుల కుటుంబ సభ్యులు అవస్థలు పడుతున్నారని విన్నవించుకున్నారు.

## పన్ను బకాయిల వసూళ్లు వేగవంతం చేయండి

● మున్సిపల్ కమిషనర్ అనూష


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

కందుకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కందుకూరు మున్సిపాలిటీలో ఇంటి పన్ను, నీటిపన్ను బకాయిల వసూళ్లు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కె అనూష సూచించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాల యంలో 16 వార్డు సచివాలయాల అడ్మిన్‌లు, ఎమినిటీ సెక్రటరీలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ రెండేళ్లకు పైబడి బకాయిలు ఉన్నవారికి తక్షణం నోటీసులు జారీచేసి నిర్దేశిత గడువులోగా వారు బకాయి లు చెల్లించకుంటే నీటి కుళాయి కనెక్షన్ కట్ చేయాలని ఆమె సూచించారు. ప్రజలు కూడా తక్షణం బకాయిలు చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు


విద్యార్థికి రైటింగ్ ప్యాడ్, ప్రశంసాపత్రం అందచేస్తున్న ఎమ్పీడీవో శ్రీదేవి

కావలి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు సమాజంలో గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని ఎమ్పీడీవో సీహెచ్.శ్రీదేవి తెలిపారు. కావలి పట్టణంలోని గ్రంథాలయ ఆవరణలో బుధవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్పీడీవో వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, శాఖ గ్రంథాలయ అధికారిణి సునీత తదితరులు పాల్గొన్నారు.

## పంటల సాగులో భూసార పరీక్షలు కీలకం


కార్యక్రమంలో మాట్లాడుతున్న దేవసేనమ్మ

ఆత్మకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పంట సాగులో భూసార పరీక్షలు కీలకమని ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకురాలు వి దేవసేనమ్మ పేర్కొన్నారు. బుధవారం ఆమె మండలంలోని మహిమలూరు, రామస్వామిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె భూసార పరీక్షలకు కనుగుణంగా ఎరువులు వాడాలని రైతులకు సూచించారు. వరి సాగులో రైతులు నారుమడి దశ నుంచి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి కిషోర్‌బాబు, మహిమలూరు గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### తెగుళ్లతో జాగ్రత్త

ఉదయగిరి (రూరల్,ఆంధ్రజ్యోతి): పంటలకు సోకే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండి నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఆంజనేయులు నాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బండగానిపల్లి, జీ.చెరువుపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగులో ఉన్న వరి పంటను పరిశీలించారు. అనంతరం పంటలకు సోకే తెగుళ్ల నివారణపై అవగాహన సదస్సులు నిర్వహించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనంతో విజ్ఞానం

ఆత్మకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కెవి శేషారెడ్డి, తెలుగు భారతి సేవా సమితి పెద్దలు ఎస్ యానాదిరెడ్డి, వెంకటేశ్వర్లు, వి నారాయణరావు పేర్కొన్నారు. బుధవారం వారు స్థానిక గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు గ్రంథాలయ ప్రాముఖ్యత, పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత లైబ్రేరియన్ గోవిందరెడ్డి, మేధా స్కూల్ కరస్పాండెంట్ సుబ్బయ్య, ప్రగతి స్కూల్ కరస్పాండెంట్ రామ్మోహన్‌రెడ్డి, గాయత్రి స్కూల్ కరస్పాండెంట్ పద్మప్రియ, గ్రంథాలయ లైబ్రేరియన్ శ్రీనివాసరాజు, రికార్డు అసిస్టెంట్ తనూజ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు

● ఇక్బాల్ అహ్మద్, తహసీల్దార్, కందుకూరు



కందుకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కార్యాలయాల సముదాయంలో ఐవోసీ పెట్రోలుబంకు ఏర్పాటుకు గత ప్రభుత్వంలో 20 సెంట్లు కేటాయించారు. అయితే ఈ కేటాయింపుపై ప్రజలు, వివిధ సంఘాల నుంచి వ్యతిరేకత వస్తుండటంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారి ఆదేశాల మేరకే తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఇక్బాల్ అహ్మద్ పేర్కొన్నారు.

? మండల కార్యాలయాల ఆవరణలో పెట్రోలు బంకుకు అనుమతి ఇచ్చారా.

! గత ప్రభుత్వంలో అనుమతి ఇచ్చారట. మాకు కూడా ఈరోజే తెలిసింది.

? ఎన్నో ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నచోట పెట్రోలు బంకు ఏర్పాటు సమంజసమేనా ?

! పెట్రోలుబంకు ప్రతిపాదనను బుధవారం కందుకూరు అభివృద్ధి మండలి ప్రతినిధులు వ్యతిరేకించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతా.

? ఏ ప్రాతిపదికన స్థలాన్ని కేటాయించారు

! ఆ ప్రోసీడింగ్స్‌ను పూర్తిగా చదవలేదు. ఫైలు పరిశీలించాక తెలియచేస్తా.

? వరాల సాయినగర్ అక్రమాల గురించి ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించారు కదా.

! వరాలసాయినగర్‌లో పట్టాలు ఎవరికీ ఇవ్వలేదని, ఆ స్థలం అన్యాక్రాంతం అయిందని ఎమ్మెల్యే అన్నారు. విచారణకు ఆదేశాలు వస్తే విచారణ జరుపుతాం.

న్యూస్ బాక్స్

### ఆదినారాయణరెడ్డికి ఘన నివాళులు

అల్లూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి తండ్రి ఆదినారాయణరెడ్డి 43వ వర్ధంతి సందర్భగా మంగళవారం ఆయన అభిమానులు అల్లూరులోని నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, దొడ్ల వెంకారెడ్డి, గోసల గోపాల్‌రెడ్డి, హరిప్రసాద్, వెంకటేశ్వర్లు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### జనరిక్ మెడికల్ షాపు ప్రారంభం

ఆత్మకూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బిఎస్‌ఆర్ సెంటర్‌లో సాయిరేఖ జనరిక్ మందుల దుకాణాన్ని బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, టీడీపీ నాయకులు ఆనం రంగమయూర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతర పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి, సీఐ వేణు, మున్సిపల్ కమిషనర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆపండి


డీఈకి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నేతలు

కావలిటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆపాలని కోరుతూ సీపీఎం నేతలు బుధవారం ఎలక్ట్రికల్ డీఈ బెనర్జీకి వినతిపత్రం అందజేశారు. సీపీఎం నేతలు మాట్లాడుతూ ట్రూ అప్ చార్జీల పేరుతో వేలకు వేలు బిల్లులు కట్టాలంటే పేదలు మధ్య తరగతి ప్రజలు వీలుకాదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల వద్ద దోచుకుని అదాని అంబానీ లాంటి బడా బాబులకు లాభాలు చేకూర్చు తున్నాంన్నారు. పాలకులు ఇప్పటికైనా ప్రజలకి ఇబ్బందికలిగించే చర్యలు మానుకోవాలని, ఎన్నికల హామీలు అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పి.పెంచలయ్య, ఉపాధ్యక్షుడు మధు సూదన్‌రావు, యర్రంశెట్టి మోహన్ పాల్గొన్నారు.

### అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

బిట్రగుంట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. బోగోలు మండలంలో ప్రొహిబిషన్ ఎస్సై దేవిక, సిబ్బందితో కలిసి ఆయన బుధవారం పలుచోట్ల తనిఖీలు నిర్వహించారు. పాతబిట్రగుంట ఎస్టీ కాలనీలో పాలకుర్తి కొండయ్య వద్ద 10 క్వార్టర్ సీసాలు లభించాయని తెలిపారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కొండయ్యను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## అడుగడుగునా గుంతలు

### కొమ్మరపూడి మార్గంలో ప్రయాణం నరకం

నెల్లూరు-తాటిపర్తి రహదారి నుంచి కొమ్మరపూడి గ్రామంలోకి వెళ్లే రోడ్డంతా ఇదిగో ఇలా గుంతలమయమైంది. ఇటీవల భారీ వాహనాలు ఈ రోడ్డును చిన్నాభిన్నం చేసేశాయ్. కనీసం ఈ గుంటలకు మట్టేసే పరిస్థితుల్లోనూ పంచాయతీ పాలకులు లేకపోవడంతో గ్రామస్థులు ప్రయాణ కష్టాలను ఎదుర్కొంటున్నారు. అందులో వర్షా కాలం మొదలవడంతో రోడ్డు మ రింత పాడవుతుందేమోనన్న ఆందోళన గ్రామ ప్రజల్లో నెలకొంది.

- నెల్లూరురూరల్,(ఆంధ్రజ్యోతి)






## కృత్రిమ గర్భధారణతో మేలుజాతి పెయ్యదూడలు

● పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్‌నాయక్

విడవలూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కృత్రిమ గర్భధారణతో మేలుజాతి పెయ్యదూడలను పొందవచ్చునని పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్‌నాయక్ తెలిపారు. విడవలూరు పశువైద్యశాలలో బుధవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు దూడల ప్రదర్శన, ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న జేడీ దూడలకు నట్టల నివారణ మందు వేశారు. అనంతరం జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగా మినీ గోకులాలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాసాల పెంపకానికి రైతులకు నగదు ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆనంతరం లేగదూడల ప్రదర్శనలో విజేతలకు బహుమతులను అందజేశారు. పాల ఉత్పత్తి పెరిగేందుకు క్యాల్షియం టానింగ్‌లను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఏ చైర్మన్, వీసీసీ డిప్యూటీ డైరెక్టర్ సోమయ్య, పశుసంవర్ధక శాఖ నెల్లూరు డీడీ నాగమణి, డీఎల్‌డీఏ డీడీ శ్రీనివాసరావు, కోవూరు ఏడీఏ కృష్ణమౌర్య, పశువైద్యశాల అధికారిణి వాణిశంకర్, టీడీపీ నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి పాల్గొన్నారు.


రైతులకు బహుమతులు అందజేస్తున్న జేడీ రమేష్‌నాయక్

## న్యూస్ బాక్స్

### చంద్రబాబుతో సోమిరెడ్డి భేటీ


చంద్రబాబుకు సమస్యలను వివరిస్తున్న సోమిరెడ్డి

నెల్లూరు (వైద్యం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని బుధవారం రాష్ట్ర సచివాలయంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కలిశారు. సర్వేపల్లి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు ప్రధాన సమస్యలతోపాటు రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులకు నిధులు, పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు, కొత్త పరిశ్రమల ఏర్పాటు తదితర అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

### చేనేతలను ఆదుకోవాలి

కోవూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని నియోజకవర్గ చేనేత సంఘం నాయకుడు కేవీ శేషయ్య కోరారు. ఇనమడుగులోని చేనేత సంఘ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతలపూడి పెంచలయ్య, బోనగిరి మల్లికార్జున, గుత్తికొండ వెంకయ్య, కొప్పర్తి హరనాథ్, పప్పు నారాయణ, దివి శ్రీనివాసులు, కోలాటి రాజేష్, శివకుమార్ పాల్గొన్నారు.

### రేపు సామాజిక ప్రజావేదిక

మనుబోలు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): 2023-24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో జరిగిన ఉపాధిహామీ పథకం పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈనెల 22వ తేదీన సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు బుధవారం ఈసీ సుప్రజ తెలిపారు.

### మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి

సైదాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం కోఆపరేటివ్ సొసైటీస్‌పై వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. మాక్ట్ చట్టంలోని బైలాస్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ఈసీ సభ్యులు, సీసీలు, వివోఏలు, సభ్యులు పాల్గొన్నారు.

### వార్త రాయించాడని దాడి

నెల్లూరు(క్రైం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : డాబాల్లో మద్యం సేవిస్తున్నారంటూ పత్రికల్లో వచ్చిన వార్తలను తాను సమాచారం ఇచ్చి రాయించానంటూ తనపై దాడి చేశారని వెంకట శ్రీకాంత్ అనే వ్యక్తి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... బుచ్చిరెడ్డిపాళెనికి చెందిన శ్రీకాంత్ నగరంలో డాబా నిర్వహిస్తున్నారు. పక్కనే జనార్దన్ అనే వ్యక్తి మరో డాబా నిర్వహిస్తున్నారు. అందులో మద్యం తాగిస్తున్నారంటూ మీడియాలో వార్తలు వచ్చాయి. ఆ వార్త రాయించింది శ్రీకాంతేనని భావించిన జనార్దన్ ఈ నెల 19వ తేదీ రాత్రి మురళి, కార్తీక్ అనే వ్యక్తులతో కలిసి శ్రీకాంత్ డాబాపై దాడి చేశారు. ఈ క్రమంలో శ్రీకాంత్ గాయపడ్డాడు. ఆయన చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రేపు జాబ్‌మేళా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం వినయ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.ఐటీఐ, డిగ్రీ, ఏదైనా డిప్లమో విద్యార్హత కలిగి 18 నుంచి 30 ఏళ్ల వయసు కలిగిన యువతీ యువకులు మేళాకు హాజరు కావచ్చన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు ఆధార్ కార్డు జెరాక్స్, రెజ్యూమ్ తీసుకురావాలని ఆయన సూచించారు.

### మహిళ మృతి

బుచ్చిరెడ్డిపాళెం,నవంబరు20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లాయపాళెం వద్ద బుధవారం ఓ కారు ఆటోను ఢీకొన్న సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆర్ఆర్ నగర్‌కు చెందిన చేవూరు పోలమ్మ, (40)మృతి చెందింది. నెల్లూరు నుంచి అతివేగంగా వస్తున్న కారు, బుచ్చి నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న ఆటోను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### 'పొలం పిలుస్తోంది' గ్రామసభ

సైదాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతేగుంట, లింగసపాళెం గ్రామాల్లో మండల వ్యవసాయశాఖాధికారి హైమావతి ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది గ్రామసభలు నిర్వహించారు.

## జెన్‌కో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ముత్తుకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్‌కో థర్మల్ కేంద్రం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు గడ్డం అంకయ్య డిమాండ్ చేశారు. జెన్‌కో థర్మల్ కేంద్రం ఎదుట బుధవారం విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో సామూహిక రాయబార నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబసభ్యులకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్, యూనియన్ నాయకులు నాగరాజు, సుబ్బలక్ష్మి, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు చీకిరి ఆదిశేషయ్య, కోశాధికారి వెంకటేశ్వర్లు, అనిల్, కస్తూరి పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

## రైతుల అభ్యున్నతికి కృషి : పోర్టు సీఈవో

ముత్తుకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అ దానీ కృష్ణపట్నం పోర్టు పరిసరాల ప్రాంతాల్లోని రైతుల అభ్యున్నతికి అదానీ ఫౌండేషన్ ద్వారా కృషి చేస్తున్నామని పోర్టు సీఈవో జగదీష్ పటే ల్ తెలిపారు. బుధవారం పోర్టులో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రైతులతో సొసైటీ ఏర్పాటు చేసి వారికి అవసరమైన వ్యవసాయ పరికరాలతో పాటు, పోషకాలను అందజేస్తామన్నారు. రైతులకు స్ప్రేయర్లు, జిప్సమ్ అందజేశారు. కార్యక్రమంలో ఏడీ గోపినాయక్, ఉద్యానశాఖ అధికారి కార్తీక్, అధికారులు భవాని, సంధ్య, అదాని ఫౌండేషన్ హెడ్ రాజేష్‌రంజన్, సీనియర్ పీవో డాక్టర్ రమేష్ బాబు, వ్యవసాయ చీఫ్ మెంటర్ సెల్వరాజ్, ప్రతినిధులు అరుణ్, రవీంద్ర పాల్గొన్నారు.


రైతులకు పరికరాలు అందజేస్తున్న సీఈవో



## ఘనంగా బయ్యా రవి జన్మదిన వేడుకలు



పుట్టినరోజు వేడుకల్లో బయ్యా రవికుమార్, వాసు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత బయ్యా రవికుమార్ జన్మదిన వేడుకలను బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. నగరంలోని చిన్నబజారులో అన్నదానం చేశారు. వెంకటగిరి బాలాజీ షాపింగ్ మాల్, యాడ్స్ భారత్ ఆధ్వర్యంలో మూడవ మైలు ప్రాంతంలోని గోదాములో వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత బయ్యా వాసు, బయ్యా రాణా, వారి కుటుంబ సభ్యులు, సిబ్బంది, బాలాజీ షాపింగ్ మాల్ అధినేతలు జనాపాటి బాలాజీ, బాలకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. బుచ్చిలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి మంజులత ఆధ్వర్యంలో జరిగిన ముగింపు సభలో ముఖ్య అతిథిగా ఈవోపీఆర్డీ ఎం నారాయణరెడ్డి పాల్గొని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దిలీప్‌కుమార్, రిసోర్సు సభ్యుడు గండికోట సుధీర్‌కుమార్, హెచ్‌ఎం సుజాత, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు సురేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులోని గోపాలకృష్ణయ్య స్కూలో జరిగిన 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో ఔత్సాహిక ఖగోళ శాస్త్రవేత్త వారణాసి దుర్గాప్రసాద్, కరస్పాండెంట్ నేలనూతల శ్రీధర్, ప్రిన్సిపాల్ సురేఖ పాల్గొన్నారు.

## గృహ లబ్ధిదారులను ఆదుకోండి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో తీవ్రంగా నష్టపోయిన గృహ లబ్ధిదారులను ఆదుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి బుధవారం అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. పేదోళ్లకు సొంతింటి కల సాకారం పేరుతో వైసీపీ పాలనలో దోపిడీ జరిగిందని ఆరోపించారు. హౌసింగ్ పేరుతో కాంట్రాక్టర్లుకు దోచిపెట్టారన్నారు. అనర్హులను లబ్ధిదారులుగా మార్చి కోట్లాది రూపాయల ప్రజాధనం కొల్లగొట్టారని విమర్శించారు. అర్హులైన వారికి ఇళ్లు కట్టుకునేందుకు తగిన సహాయ సహకారాలు అందించాలని కోరారు. కోవూరు నియోజవర్గంలో దాదాపు వెయ్యి కుటుంబాలు పక్కా ఇళ్లు లేక పూరి గుడిసెల్లో నివసిస్తున్నాయని చెప్పారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసినట్లు చూపి బిల్లులు చేసుకున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

### సీఎం సహాయనిధి ఎల్‌వోసీ అందజేత

కోవూరు మండలంలోని పెద్దపడుగుపాడుకు చెందిన మైలారు మల్లికార్జున కుమారుడు శ్యామ్ బ్రోన్‌మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్‌కు రూ.10 లక్షల సీఎం సహాయనిధి ఎల్‌వోసీని బుధవారం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తన నివాసంలో అందచేశారు. శ్యామ్ అనారోగ్య విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ప్రశాంతిరెడ్డి తీసుకెళ్లటంతో, చంద్రబాబు మానవతా దృక్పథంతో స్పందించి రూ.10లక్షల ఆర్థిక సహాయాన్ని అందచేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున దంపతులు సీఎం, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.


సీఎం సహాయనిధి ఎల్‌వోసీ అందచేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



## చంద్రబాబు అరెస్ట్ కుట్రపై విచారణ జరిపించండి

● హోం మంత్రి అనితకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి లేఖ

నెల్లూరు రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును వైసీపీ ప్రభుత్వంలో అరెస్ట్ చేసేందుకు జరిగిన మహా కుట్రపై విచారణ జరిపించి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితకు బుధవారం లేఖ రాశారు. స్కిల్ స్కాంను సృష్టించిన వైసీపీ ప్రభుత్వంలోని పెద్దలు చంద్రబాబును 53 రోజులు జైల్లో ఉంచారని తెలిపారు. దీనిపై విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేష్ చేసిన వ్యాఖ్యలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఆయన డీజీపీకి రాసిన లేఖలోని అంశాలపై విచారణ జరిపించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సంఘటనలకు సంబంధించిన కొన్ని ఆధారాలను తన లేఖతోపాటు పంపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.


వైన్ షాపు యజమానితో వాగ్వాదం చేస్తున్న మహిళలు

### మద్యం దుకాణం ఏర్పాటుపై మహిళల నిరసన

సైదాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలిచేడు గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటుపై బుధవారం స్థానిక దళిత మహిళలు నిరసన వ్యక్తం చేశారు. చెరువు కట్ట కింద ఉన్న ఎండీ సలాం మాగాణి భూమిలో దుకాణం ఏర్పాటుకు స్థలం పరిశీలిస్తున్న సమయంలో మహిళలు అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. దీంతో మరోచోట మద్యం దుకాణం ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. గ్రామంలోకి వెళ్లే రోడ్డులో మద్యం దుకాణం నిర్వహిస్తే సహించమని స్థానిక టీడీపీ నాయకులు తెలిపారు.





### గిరిజనుల సమస్యలపై అసెంబ్లీలో కురుగొండ్ల గళం

సైదాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోచాం పంచాయతీ పరిధిలోని మునగపాడు గిరిజన కాలనీ సమస్యలపై వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అసెంబ్లీలో గళం విప్పారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అసెంబ్లీలో మాట్లాడుతూ 1994 టీడీపీ ప్రభుత్వంలో మునగపాడు ఎస్టీ కాలనీలో గిరిజనుల కోసం 70 గృహాలు మంజూరు చేసిందన్నారు. అక్కడ ఇంటర్నల్ రోడ్లు లేక గిరిజనులు ఇబ్బందులకు గురవుతున్నారని, రోడ్లు వేయాలన్నా అటవీ శాఖాధికారులు అడ్డంకులు కల్పిస్తున్నందున రోడ్లు వేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.

### సమస్యల పరిష్కార వేదిక జనవాణి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కార వేదికగా మారిందని ఆ పార్టీ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ తెలిపారు. నగరంలోని గోమతి నగర్‌లో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం జనవాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఈఈ వెంకటేశ్వరరావు, జనసేన కోవూరు నియోజకవర్గ నాయకుడు గుడి హరిరెడ్డి, రూరల్ నియోజకవర్గ నాయకుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### విలీన ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

● టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నగరానికి ఆనుకుని ఉన్న విలీన ప్రాంతాల అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. బుధవారం 31వ డివిజన్‌లో రూ. 30 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి విలీన ప్రాంతాలను వీలైనంత వరకు అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. మంత్రి నారాయణ సహకారంతో విలీన ప్రాంతాల అభివృద్ధికి డివిజన్‌కు రూ. కోటి చొప్పున రాబట్టినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బత్తల మంజుల, నాయకులు కృష్ణ, మన్నేపల్లి రఘు, మాజీ ఏఎంసీ చైర్మన్ హరిబాబు యాదవ్, మస్తాన్‌నాయుడు పాల్గొన్నారు.

### రవి చెస్ట్ ఆసుపత్రిలో ఉచిత చికిత్సలు

నెల్లూరు(వైద్యం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రవి చెస్ట్ ఆసుపత్రిలో బుధవారం డాక్టర్ పోకల రవి ఉచిత వైద్య చికిత్సలు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ సీవోపీడీ నివారణ దినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో పెద్ద సంఖ్యలో సీవోపీడీ రోగులకు పరీక్షలు నిర్వహించి వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ ధూమపానం, పరిశ్రమల కాలుష్యం, వంట చెరుకు తగల బెట్టటం వల్ల వచ్చే పొగ పీల్చడంతో సీవోపీడీ వ్యాధి వస్తుందని చెప్పారు. దేశంలో 8 శాతం మంది ప్రజలు ఈ వ్యాధితో అల్లాడుతున్నారన్నారు. దీనిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.


రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ పోకల రవి

### ఘనంగా 'పచ్చిపాల' పుట్టినరోజు వేడుకలు

మనుబోలు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి పార్లమెంట్ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి పుట్టినరోజు వేడుకలను బుధవారం మనుబోలులో ఘనంగా నిర్వహించారు. పచ్చిపాల నివాసంలో, స్థానిక అంబేడ్కర్ నగర్‌లో పచ్చిపాల అభిమానులు, టీడీపీ యువనాయకులు కేక్‌లు కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. మాజీ ఎంపీపీ చేరెడ్డి పట్టాభిరామిరెడ్డి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు సాని వెంకటరమణయ్య, రాష్ట్ర రైతు కార్యదర్శి రాయపాటి కిరణ్‌కుమార్‌లు పచ్చిపాలను శాలువాకప్పి, బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దండు చంద్రశేఖర్‌రెడ్డి, శివుడు రాజాగౌడ్, కలికి సుధీర్‌రెడ్డి, చెల్లగిరి ప్రసాద్, చింతల వెంకటేశ్వర్లు, పచ్చిపాల శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పచ్చిపాలకు కేక్ తినిపిస్తున్న పట్టాభిరామిరెడ్డి


### నగరంలోని భవనాలను లెక్కించండి : ఏడీసీ

నెల్లూరు(సిటీ), నవంబరు 20 (ఆంధ్ర జ్యోతి) : నెల్లూరు నగరంలోని కొత్త, పాత భవనాలను లెక్కించి వాటి కొలతలు, వివరా లను ఆన్‌లైన్‌లో పొందు పరచాలని ఏడీసీ నందన్ సిబ్బందిని ఆదేశించారు. బుధ వారం నగరంలో జరు గుతున్న సర్వే, భవనాల పరిశీలన ప్రక్రియను ఆయన పరిశీలించారు. అన్నీ విభాగాల ఉద్యోగులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సచివాలయాల్లోని ఉద్యోగులు ఉదయం 8 గంటలకే క్షేత్రస్థాయిలో భవనాలను లెక్కకట్టాలని ఆదేశించారు. కార్పొరేషన్ అనుమతులు లేని భవనాలను గుర్తించాలని సిబ్బందికి సూచించారు.


సర్వే సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీసీ నందన్

### ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నివేదిక ఇవ్వాలి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఏకసభ్య కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ ఓ ప్రకటనలో కోరారు. దీనికి సంబంధించి మాదిగ జేఏసీ నేతల ఐక్య వేదిక సమావేశాన్ని వచ్చే నెల 10న విజయవాడలో నిర్వహిస్తున్నారన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి, పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్‌ను, లీడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావును కలిసి జేఏసీ నేతల సమావేశానికి రావాలని ఆహ్వానించామని తెలిపారు.





## అసెంబ్లీ వాయిస్




నేడు జాతీయ మత్స్య దినోత్సవం

### 'టీడీఆర్ బాండ్ల' అవినీతిపై విచారించండి



తిరుపతిలో మాస్టర్ ప్లాన్ రోడ్ల పేరిట గత వైసీపీ ప్రభుత్వం భారీగా అవినీతికి పాల్పడింది. దీనికి సంబంధించి టీడీఆర్ బాండ్ల జారీలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలి. తిరుమల బాలాజీ నగర్‌లో 1136 ఇళ్లుంటే ఇప్పటి వరకు 538 ఇళ్లకు మాత్రమే స్లాబ్ వేశారు. మిగిలిన వాటికీ స్లాబ్ వేసేందుకు చర్యలు తీసుకోవాలి. గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా శ్రీవారి దర్శన టికెట్లు అమ్ముకుని స్థానికులకున్న దర్శన వెసులుబాటును రద్దు చేశారు. మళ్లీ స్థానికులకు దర్శనాన్ని టీటీడీ పునరుద్ధరించడం హర్షణీయం. తిరుపతిని గంజాయిరహిత నగరంగా తీర్చిదిద్దుతామన్న హామీ పూర్తి స్థాయిలో అమలయ్యేలా చూడాలి.

– ఆరణి శ్రీనివాసులు, తిరుపతి

### దయనీయంగా ప్రభుత్వాస్పత్రి



వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించి ఇక్కడి ఆస్పత్రిలోని ఉచిత డయాలసిస్ కేంద్రంలో సేవలను నిర్లక్ష్యం చేసింది. ఆస్పత్రి అభివృద్ధి పేరిట అప్పటి వైసీపీ నేతలు రూ.కోట్లలో దుర్వినియోగం చేసి కనీస వసతులు కూడా కల్పించలేదు. ప్రభుత్వాస్పత్రి నుంచి పేదలు మృతదేహాలను తరలించాలన్నా కనీసం రూ.10వేలు ఖర్చయ్యే పరిస్థితిని తీసుకొచ్చారు. నియోజకవర్గంలో ఆరు సంక్షేమ వసతి గృహాలు దుర్భరంగా ఉన్నాయి. ప్రభుత్వాస్పత్రితో పాటు సంక్షేమ వసతిగృహాలను బాగు చేసేందుకు ప్రభుత్వం సహకరించాలి.

– బొజ్జల సుధీర్‌రెడ్డి, శ్రీకాళహస్తి

### కోసలనగరం.. పరిశ్రమలకు అనుకూలం



నగరి నియోజకవర్గంలోని కోసలనగరం పారిశ్రామిక రంగానికి ఎంతో అనుకూలం. పదేళ్ల కిందట ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు ఏపీఐఐసీ 2500 ఎకరాలను సేకరించింది. ఇప్పటికీ ఒక్క పరిశ్రమనూ ఏర్పాటు చేయలేదు. చెన్నై విమానాశ్రయానికి, పోర్టుకు 60 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతం ఉంది. చెన్నై- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ వే కూడా కోసలనగరం మీదుగా వెళుతోంది. ఇంత అనుకూలంగా ఉన్న ఇక్కడ పరిశ్రమల ఏర్పాటు చేస్తే రాష్ట్ర ఆర్థిక ప్రగతి తో పాటు ఈ ప్రాంతం అభివృద్ధికి దోహదపడుతుంది.

– గాలి భానుప్రకాష్, నగరి

– తిరుపతి/శ్రీకాళహస్తి/పుత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి



## కరువు సీమలో జల సంపద

విభజన తర్వాత తిరుపతి జిల్లాకు అపారమైన మత్స్య సంపద కలిసి వచ్చింది. ఏకంగా 80 కిలోమీటర్ల పొడవైన సముద్రతీరం వరంగా వచ్చింది. 460 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంగల పులికాట్ సరస్సులో అత్యధికభాగం జిల్లాలో భాగం అయింది. గూడూరు ప్రాంతంలోని ఆక్వా కూడా మన ఖాతాలో చేరింది. దీంతో ఏడాదికి 80 వేల టన్నుల మత్స్యసంపద ఉత్పత్తి అవుతున్న జిల్లాగా తిరుపతి మారింది. దీని ద్వారా ఏటా రూ.700 కోట్లు ఆదాయం జిల్లాకు రావడం విశేషం.

**కథనం** తిరుపతి, ఆంధ్రజ్యోతి

- తిరుపతి జిల్లాలో మత్స్య సంపద ద్వారా ఏటా రూ. 700 కోట్ల ఆదాయం





### రూ. 300 కోట్ల సముద్ర సంపద

2022 ఏప్రిల్‌లో తిరుపతి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడింది. అంతకు మునుపుదాకా ఉమ్మడి జిల్లాలో స్థానిక చెరువులు, ప్రాజెక్టులు తప్ప చెప్పుకోదగ్గ మత్స్యసంపద జిల్లాలో లేదు. ఈ మత్స్య సంపద స్థానిక అవసరాలకే సరిపోయేది. తిరుపతి జిల్లాలో నెల్లూరు జిల్లా నుంచీ 14 మండలాలు చేరడంతో జిల్లా స్వరూప స్వభావాలు సమూలంగా మారిపోయాయి. కోట, వాకాడు, చిల్లకూరు, సూళ్ళూరుపేట, తడ మండలాలు సముద్ర తీర ప్రాంతాన్ని కలిగి వున్నాయి. ఈ ప్రాంతంలో 70 వేల మత్స్యకార జనాభా వుండగా 12 వేల మందికి పైగా చేపలు పట్టడాన్ని ఉపాధిగా మార్చుకుని జీవిస్తున్నారు. దీంతో 80 కిలోమీటర్ల సముద్ర తీరం జిల్లాకు ఆదాయ వనరుగా మారింది. ఏటా సముద్రం నుంచీ 8744 టన్నుల మత్స్య సంపదను జిల్లా మత్స్యకారులు వెలికి తీస్తున్నారు. వీటిని వివిధ ప్రాంతాలకు తరలించి విక్రయించడం ద్వారా ఏటా రూ. 300 కోట్ల మేరకు ఆదాయం పొందుతున్నారు.

**సముద్రంలో దొరుకుతున్నవి:** కానగత్తలు, కవళ్ళు, వంజరం, చందువ, తూర, తాటాకు, టేకు, సొర, మిల్క్, పండుగప్ప, టైగర్ రొయ్య, తెల్ల రొయ్య, పచ్చ పీతలు, చుక్కల చేపలు.



### మన జాక్‌పాట్ పులికాట్



ఏపీ, తమిళనాడు రాష్ట్రాల పరిధిలో 461 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో విస్తరించిన పులికాట్ సరస్సు సింహ భాగం మన జిల్లాలోనే వుంది. తమిళనాడు పరిధిలో కేవలం 61 చదరపు కిలోమీటర్లు వుండగా ఏపీలో అంటే మన జిల్లాలో 400 కిలోమీటర్లు విస్తరించి వుంది. 168 రకాల చేపలు, రొయ్యలు ఇందులో లభిస్తాయి. పది వేల మంది మత్స్యకారులు సరస్సుపై ఆధారపడి బతుకుతున్నారు. వీటి విక్రయాల ద్వారా రూ. 60 కోట్ల దాకా జాలర్లు ఆదాయం గడిస్తున్నారు. గతేడాది పులికాట్ సరస్సు నుంచీ రొయ్యలు మాత్రమే 10,511 టన్నులు ఉత్పత్తి అయ్యాయి.

**పులికాట్‌లో దొరికేవి:** మొయ్య, జెల్ల, పైలెట్, పీతలు, రొయ్యలు.



### పూడిక తొలగిస్తే..

పులికాట్ సరస్సులో పూడిరాయి దొరువు వద్ద సముద్ర ముఖద్వారాలు పూడిపోయిన సంగతి తెలిసిందే. దశాబ్దాలుగా ప్రభుత్వం పూడిక తొలగింపు మీద దృష్టి పెట్టకపోవడంతో జిల్లా భారీ ఎత్తున మత్స్య సంపదను కోల్పోతోంది. తాజాగా కూటమి ప్రభుత్వం పూడిక తొలగింపు కోసం రూ. 97 కోట్లు విడుదల చేసింది. సంబంధిత పనులు త్వరగా పూర్తయితే సరస్సులో మత్స్య సంపద మరిన్ని రెట్లు ఎక్కువ ఉత్పత్తి అయ్యే అవకాశముంది.

### పెంపకం చేపలు, రొయ్యలు ద్వారా రూ.400 కోట్లు





**పెంచుతున్నవి:** కట్లా, రోహు, మృగాల, కొరమీను, బంగారు తీగ, రూప్ చంద్, గండిచేప, తిలాపియా రకం చేపలు.



చేపలూ రొయ్యల పెంపకం కూడా జిల్లాకు భారీ ఆదాయం తెచ్చిపెడుతోంది. జిల్లాలో మొత్తం 560 చెరువులు, మూడు రిజర్వాయర్లలో 1.13 లక్షల ఎకరాల విస్తీర్ణంలో మంచి నీటి రకాల చేపలు ఉత్పత్తి అవుతున్నాయి. వంద ఎకరాల్లో చేపల చెరువులు, 9417 ఎకరాల్లో రొయ్యల చెరువులను ఆక్వా రైతులు సాగు చేస్తున్నారు. గతేడాది లెక్కలు పరిశీలిస్తే దేశీయ చేపల ఉత్పత్తి 60915 టన్నులు కాగా రొయ్యల ఉత్పత్తి 2713 టన్నులు. వీటి ద్వారా జిల్లాకు రూ. 400 కోట్ల ఆదాయం వచ్చింది.



## మాడవీధుల్లో భక్తుల ప్రదక్షిణ పాట్లు

- గేట్లు మూసివేత నిర్ణయంతో అవస్థలు



గేట్లు మూసివేయడంతో నిరీక్షిస్తున్న భక్తులు

తిరుమల, నవంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమల దక్షిణ మాడవీధుల్లోని గేట్లతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం మూస్తూ, తీస్తూ అగచాట్లకు గురిచేస్తున్నారు. సాధారణంగా శ్రీవారి దర్శనానికి వచ్చే వారు మాడవీధుల్లో ప్రదక్షిణ చేయడం ఆచారం. రద్దీరోజుల్లో దర్శనం చేసుకోలేకపోయిన భక్తులూ మాడవీధుల్లో ప్రదక్షిణ చేసి అఖిలాండం వద్ద కొబ్బరి కాయ కొట్టి వెళ్లిపోతుంటారు. గత ప్రభుత్వంలోని అధికారుల నిర్ణయం నేటికీ కొనసాగుతున్న క్రమంలో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లలో భక్తులు దక్షిణ మాడవీధిలోని ఇనుప బిడ్జి నుంచి ఆలయంలోకి వెళ్లి దర్శించుకుంటారు. గత ప్రభుత్వంలోని అధికారులు అధిక సంఖ్యలో భక్తులను ఆలయంలోకి అనుమతించాలనే పేరుతో వృద్ధులు, దివ్యాంగుల కోసం తిరుమల నంబి ఆలయం ముందుగా ఏర్పాటు చేసిన అదనపు క్యూలైన్‌లో నుంచే ఇతర భక్తులను తరచూ అనుమతిస్తున్నారు. ఈ క్రమంలో భక్తులు అటు, ఇటూ ప్రవేశించకుండా గేట్లు మూసివేస్తున్నారు. దీంతో ప్రదక్షిణ చేయాలనుకున్న భక్తులు గంటల తరబడి గేట్ల ముందే పడిగాపులు కాస్తున్నారు. కొందరు నిరీక్షించలేక తిరిగి వెళ్లిపోతున్నారు. బిడ్జిపై నుంచి భక్తులను ఆలయంలోకి అనుమతిస్తున్నప్పుడు ఈ అదనపు క్యూలైన్ ఏంటంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పరిశీలించి తమ ప్రదక్షిణకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

## ఐతేపల్లె @ ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ

చంద్రగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళలకు మరింత తోడ్పాటు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయి. ఇందులో భాగంగా మహిళా స్నేహపూర్వక పంచాయతీల (ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ) పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాయి. దీనికోసం జిల్లాకు ఒకటి చొప్పున రాష్ట్రంలో 26 పంచాయతీలను ఎంపిక చేశాయి. అందులో తిరుపతి జిల్లా నుంచి చంద్రగిరి మండలం 'ఐతేపల్లి' ఉంది. 1924 మంది జనాభా కలిగిన ఈ పంచాయతీకి సర్పంచిగా ఫాజిల్లా వ్యవహరిస్తుండగా, 10 మంది వార్డు సభ్యులూ మహిళలే ఉన్నారు. ఈ కార్యక్రమం కింద పంచాయతీలో మహిళల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడేలా వారి భాగస్వామ్యంతో మౌలిక సదుపాయాలు సమకూరుస్తారు. విద్య, వైద్యం, స్వయం ఉపాధి వంటి పథకాల అమలుకు పెద్దపీట వేస్తారు. ఇళ్ల నుంచి విధిగా చెత్త సేకరణ, ఘనవ్యర్థాల నిర్వహణకు ప్రాముఖ్యం ఉంటుంది. బాల్య వివాహాలు, శిశుమరణాల నియంత్రణకు చర్యలు చేపడతారు. వ్యసనాలు లేని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతారు.



## 'అపార్'కు నోటరీ, అఫిడవిట్ అవసరం లేదు

- హెచ్ఎం/ఎంఈవోల లేఖ, ఎస్సెస్సీ సర్టిఫికెట్లతో జారీకి కలెక్టర్ ఆదేశం

తిరుపతివిద్య, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1-12 తరగతులు చదువుతున్న విద్యార్థుల అపార్ ఐడీకి జనన ధ్రువీకరణ పత్రం జారీ చేసేనిమిత్తం నోటరీ, అఫిడవిట్‌లు అవసరంలేకుండా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు డీఈవో కేవీఎస్ కుమార్ తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల డిక్లరేషన్/హెచ్ఎం/ ఎంఈవోల లేఖ, ఎస్ఎస్సీ మార్కుల జాబితా మేరకు కొత్త ఆధార్‌ఐడీ నమోదు, ఆధార్ కార్డులలో తేడాలను సకాలంలో సరిచేసి అందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఒకటినుంచి తొమ్మిది తరగతులు చదివే విద్యార్థులకు ఆధార్‌లో పేరు సవరించేందుకు ఆయా హెచ్ఎంలు, ప్రైవేట్ పాఠశాలల్లో అయితే తనిఖీ అధికారి నుంచితెచ్చిన డిక్లరేషన్‌తో సరి చేయాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు ఆధార్‌లో పుట్టినతేదీ సవరణకు వీఆర్వో లేదా వైద్యశాఖ లేదా మున్సిపల్ అధికారులు జారీచేసిన జననధ్రువీకరణపత్రం ఆధారంగా, ఇంటర్ విద్యార్థులకు పదో తరగతి సర్టిఫికెట్ ఆధారంగా సవరించేలా కలెక్టర్ చర్యలు చేపట్టారని వివరించారు. జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సచివాలయ సెక్రటరీలు, వీఆర్వోలు పైఆదేశాలను పాటించి విద్యార్థులపై ఒత్తిడిలేకుండా చూడాలని ఒక ప్రకటనలో కోరారు.

## మున్సిపాలిటీలో కొనసాగుతున్న విచారణ

- మరో రెండు రోజుల్లో పూర్తి

తిరుపతి, నవంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పాలకసంస్థలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్వ అధికారుల అక్రమాలపై జరుగుతున్న విచారణ మూడు రోజుల విరామం అనంతరం బుధవారం తిరిగి ప్రారంభమైంది. గత వారం మూడు రోజుల పాటు అనంతపురం రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్ నేతృత్వంలో మూడు బృందాలు తిరుపతిలో విచారణ చేపట్టాయి. ఆతర్వాత మళ్లీ తిరుపతికి చేరుకున్న విచారణ బృందం తమ పని చేసుకుపోతోంది. ఇటీవల బదిలీఅయిన రెవెన్యూ అధికారి కేఎల్ వర్మ, మేనేజర్ చిట్టిబాబు, డీఈ విజయకుమార్ రెడ్డిపై అక్రమ ఆరోపణలపై లోతుగా విచారణ చేస్తున్నట్టు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో పుంగనూరు మున్సిపల్ కమిషనర్‌గా కూడా పనిచేసిన వర్మ అవకతవకలపై ప్రత్యేక దృష్టిపెట్టినట్టు సమాచారం. ఇప్పటికే విచారణకమిటీ బృందంపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు వస్తున్నట్టు తెలిసింది. అయితే ఆర్డీ విశ్వనాథ్ ముక్కుసూటిగా వ్యవహరిస్తారన్న పేరుండడంతో విచారణ ఎదుర్కొంటున్న వారి ఎత్తులు పారడంలేదన్న ప్రచారం జరుగుతోంది. మరో రెండు రోజుల్లో విచారణ పూర్తికానుందని, నివేదికను డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు అందజేయనున్నట్టు సమాచారం.

## మరింత పటిష్టంగా సోషల్ మీడియా సెల్

- అనుచిత పోస్టులు, అసభ్యకర వ్యాఖ్యలపై నిఘా

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైం సెల్‌కు అనుబంధంగా ఉన్న సోషల్ మీడియా సెల్‌ను మరింత పటిష్ట పరచడానికి పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో 16 కేసులు నమోదైనట్లు అధికారులు చెప్పారు. ఇన్‌స్టా, వాట్సాప్, ఎక్స్ మాధ్యమాల్లో అసభ్యకర మెసేజీలు పోస్టు చేస్తున్న వారికి 41ఏ నోటీసులు అందించడం.. మరోవైపు కేసులు నమోదు చేస్తున్నారు. అయినా కొందరు అటు అధికారులు.. ఇటు ప్రభుత్వ అధినేతలను టార్గెట్‌గా చేసుకుని ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట నుంచి వాట్సాప్‌లు, ఇన్‌స్టా ద్వారా అసభ్యకర పోస్టులు పెడుతూనే ఉన్నారు. దీన్ని గుర్తించిన అధికారులు సోషల్ మీడియా సెల్‌కు అవసరమైన బాధ్యతలు, అధికారాలు కట్టబెట్టాలని ఆలోచిస్తున్నారు. కాగా, సోషల్ మీడియాలో పేరు ఒకరిది.. అకౌంటు మరొకరు హ్యాండిల్ చేస్తుండటం ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. నచ్చని పార్టీ నాయకుడిపై అసభ్యకరంగా పోస్టింగ్ లేదా మార్ఫింగ్ చేసిన ఫొటోలను అప్‌లోడ్ చేయడం వంటి వ్యవహారాలన్నీ చేస్తున్న హ్యాండిలర్స్ ఎక్కువగా యువకులే ఉన్నట్లు తెలిసింది. అటువంటి వారిపైనా పోలీసులు దృష్టి సారించారు. ప్రధానంగా కొంతమంది విద్యావంతులు.. మరికొందరు మధ్యలో ఆగిపోయి సులభంగా డబ్బు సంపాదనకు ఆశపడి ఇలాంటి అసభ్యకర పోస్టులు పెట్టి డబ్బులు ఆర్జిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా ప్రత్యేకంగా గ్రూపులు ఏర్పాటుచేస్తూ అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిని ఒకదారికి తీసుకురావడానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. సైబర్ క్రైం సెల్‌కు అనుబంధంగా ఉన్న సీఐ విక్రమ్‌ను ఇన్‌చార్జిగా నియమించిన విషయం విదితమే. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టింగులు పెడుతున్న వారిలో 16 మందిపై కేసులు నమోదు చేసిన పోలీసులు.. మిగతా వారిపైనా దృష్టి సారించినట్లు సమాచారం.




ఇసుక యార్డులకు లాటరీ తీస్తున్న కలెక్టర్

## ఏజెన్సీలకు మూడు ఇసుక యార్డులు

- లాటరీ పద్ధతి ద్వారా అప్పగింత

తిరుపతి, కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు ఇసుక యార్డులను లాటరీ పద్ధతి ద్వారా మూడు ఏజెన్సీలకు అప్పగించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లో జేసీ శుభంబన్సల్‌తో కలిసి ఆయన ఇసుక స్టాక్‌యార్డుకు సంబంధించిన లాటరీ నిర్వహించారు. అవిలాలకి సంబంధించిన లీలాఎంటర్‌ప్రైజస్‌కి, కాటన్‌మిల్‌కు సంబంధించి పి.శ్రీనివాసులురెడ్డి, గాజులమండ్యం స్టాకుయార్డుకు సంబంధించి తిష్య కన్‌స్ట్రక్షన్స్‌కి శ్రీనివాసులకు లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఐదు రోజుల్లోగా ఇసుకను అందుబాటులో తేవాలని, ప్రజలందరికీ ఇసుక స్టాక్ యార్డుల గురించి అవగాహన కల్పించాలన్నారు. కాగా, అన్నమయ్య జిల్లా టుంగుటూరు గ్రామం నందలూరు నుంచి ఇసుకను తెప్పించుకుని కాటన్ మిల్లు వద్ద ఉంచుతారు. ఇక్కడ టన్ను రూ.640 అందుబాటులో ఉంచుతున్నారు. రేణిగుంట మండలం గాజులమండ్యం దగ్గర టన్ను రూ.675, తిరుపతి రూరల్ మండలం అవిలాల వద్ద ఇసుక టన్ను రూ.645గా నిర్ధారించారు. నిర్ణయించిన ధరలకంటే ఒక రూపాయి ఎక్కువ తీసుకున్నా డీలర్‌షిప్ రద్దు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గనుల భూగర్భశాఖ అధికారి బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.



## ఆగమోక్తంగా అంగుళీ సంధాన సంప్రోక్షణం

శ్రీవారి ఆలయంలో బుధవారం సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2021లో శ్రీరాముని విగ్రహంలో ఎడమచేయి మధ్య వేలిభాగంలో చిన్నపాటి భిన్నం ఏర్పడింది. అప్పట్లో దీనికి బంగారు కవచాన్ని తొడిగి సవరించారు. సాధారణంగా ఇలాంటివి జరిగితే 12 ఏళ్లకోసారి సంప్రోక్షణం చేయడం ఆనవాయితీ. 2018లో టీటీడీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. మళ్లీ 2030లోనే సంప్రోక్షణ జరగాల్సి ఉంది. కానీ విగ్రహానికి జరిగిన లోపాన్ని సవరించేందుకు అప్పటివరకూ వేచిఉండకుండా ముందుగానే చేపట్టాలని జీయర్‌స్వాములు, ఆగమ సలహాదారులు, అర్చకుల కమిటీ సూచించింది. వారి సలహా మేరకు మంగళ, బుధవారాల్లో అంగుళీ సంధాన సంప్రోక్షణను ఆగమోక్తంగా నిర్వహించారు. బుధవారం హోమం నిర్వహించారు. జీయర్ స్వామి సమక్షంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, కృష్ణశేషాచల దీక్షితులు, గోవిందరాజ దీక్షితులు పూజలు చేశారు.

- తిరుమల(ఆంధ్రజ్యోతి)



## జిల్లాకు ఆరుగురు డీఎస్పీల రాక

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): డీఎస్పీల బదిలీల్లో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఆరుగురిని నియమిస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జె.రాంబాబును చిత్తూరు జిల్లా పోలీసు శిక్షణ కళాశాలకు, షేక్ బజిజాన్ సైదాను చిత్తూరు 8వ బెటాలియన్ డీఎస్పీగా, వి.శ్రీనివాసరెడ్డిని ఎర్రచందనం టాస్క్‌ఫోర్సుకు, జీవీ కృష్ణారావును చిత్తూరు 8వ బెటాలియన్‌కు, విజయానంద్‌ను వెంకటగిరిలోని 9వ బెటాలియన్‌కు, షరీఫ్‌ను తిరుపతిలోని ఎర్రచందనం టాస్క్‌ఫోర్సుకు నియమించారు. త్వరలో వారికి కేటాయించిన స్థానాల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.










పల్లె అందాలు పనిపాటలతో పెనవేసుకుని ఉంటాయి. పనులకాలంలో చెట్టూచేమా.. పరిసరాలన్నీ పచ్చదనంతో కళకళలాడితే, మనుషుల ముఖాల్లో సంతోషం, సంతృప్తి పొంగిపొరలుతుంటాయి. అడపాదడపా కురుస్తూనేవున్న వానలతో తిరుపతి జిల్లాలో వ్యవసాయ పనులు జోరుగా మొదలయ్యాయి. చెరువుల్లోకి కొత్త నీళ్లు చేరాయి. వంకలు పారుతున్నాయి. తెల్లవారకముందే రైతులూ, రైతు కూలీలూ పనిముట్లతో బయలుదేరుతున్నారు. 'అన్నా..వదినా.. మామా..బావా.. పిల్లా..' అంటూ చతుర్లాడుకుంటూ పొలాల్లోకి దిగుతున్నారు. ఒకవైపు నారు పెరికి కట్టలు కడుతున్నారు.. మరొకవైపు అడుసుదున్ని మడులను సిద్ధం చేస్తున్నారు.. ఇంకోవైపున నాట్లేస్తున్నారు. ముందస్తుగా నాటి ఏపుగా పెరిగిన పైర్లలో మందులు చల్లుతున్నారు.. పురుగూ పుట్రా ఏరుకుతింటూ రైతునేస్తాలు కొంగలు గుంపులుగా ఎగురుతూ వాలుతూ కనువిందు చేస్తున్నాయి. బుధవారం ఇంకా మంచు తెరలు వీడని వేకువ వేళ.. తిరుపతి సమీపంలోని అన్నాసాంపల్లి పరిసరాల్లోని ఈ అందాలను ఆంధ్రజ్యోతి తిరుపతి ఫోటోగ్రాఫర్ ఫోటో పట్టి అందిస్తున్నారు..

















వ్యాపారితో మాట్లాడుతున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

## వ్యాపారుల లైసెన్సుల డిజిటలైజేషన్

● టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, నవంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమలలో వ్యాపారుల లైసెన్సులను డిజిటలైజేషన్ చేసి దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకుంటామని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. ఒకే లైసెన్స్‌తో రెండు మూడు ప్రాంతాల్లో వ్యాపారాలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. అనధికారికంగా వ్యాపారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం సాయంత్రం ఆయన తిరుమలలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. డీఎంబీ రోడ్డులోని అన్నపూర్ణ హోటల్ భవనాన్ని ఆయన పరిశీలించారు. దుకాణాల లైసెన్సులను తనిఖీ చేశారు. ఓ టీ దుకాణంలో టీ తాగి ధరలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకయ్య చౌదరి మీడియాతో మాట్లాడుతూ.. అన్నపూర్ణ హోటల్ శిథిలావస్థకు చేరుకోవడంతో పరిశీలించామన్నారు. ఇంజనీరింగ్ అధికారుల నివేదిక ఆధారంగా త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆయన వెంట డిప్యూటీఈవో ఆశాజ్యోతి, ఎలక్ట్రికల్ డీఈ చంద్రశేఖర్, రెవెన్యూ ఏఈవో భాస్కర నారాయణ చౌదరి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గరుడాచలం నుంచీ అరుణాచలానికి

● సంస్కృత వర్సిటీ విద్యార్థి ఆచూకీ లభ్యం



కశ్యప ఆదిత్యను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్సిటీ డిగ్రీ ఫైనలియర్ విద్యార్థి కశ్యప ఆదిత్య ఆచూకీని పోలీసులు గుర్తించారు. యూనివర్సిటీలోని గరుడచాలం హాస్టల్‌లో వసతి పొందుతున్న ఇతడు.. కనిపించడం లేదంటూ పోలీసులకు కుటుంబీకులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. హాస్టల్‌లోనే ఫోన్, గుర్తింపు కార్డు వదిలి పెట్టి వెళ్లారు. అరుణాచలం నుంచీ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసినట్టు పోలీసులు తెలిపారు. దీంతో విద్యార్థి కశ్యప ఆదిత్య లొకేషన్‌ను పోలీసులు కనుక్కున్నారు. తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్‌కు రప్పించారు. బుధవారం సాయంత్రం అతడిని తండ్రి ప్రకాష్, సోదరుడు సాత్విక్‌సూర్యకు అప్పగించారు.

### ముగ్గురు సీఐలకు రెగ్యులర్ ఉత్తర్వులు


తిరుపతి(నేరవిభాగం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అటాచ్‌మెంటులో పనిచేస్తున్న ముగ్గురు సీఐలను ఆయా స్థానాల్లో రెగ్యులర్ చేస్తూ అనంతపురం డీఐజీ షిమోషీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు, చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి, యూనివర్సిటీ సీఐ రామయ్య ఉన్నారు. పనితీరు, క్రమశిక్షణ, ఇతరత్రా కారణాలను కొలమానంగా తీసుకుని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

### శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.71 కోట్లు

తిరుమల, నవంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.71 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం వివరాలను టీటీడీ బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 62,248 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 18,852 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

### పంచారామాలకు ప్రత్యేక ప్యాకేజీ టూర్

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని పంచారామాలను సందర్శించేందుకు ఏపీఎస్ ఆర్టీసీ శుక్రవారం ప్రత్యేక ప్యాకేజీ టూర్ ఏర్పాటు చేసింది. మధ్యాహ్నం ఒంటి గంటకు సెంట్రల్ బస్టాండులో సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుంది. నెల్లూరు, గుంటూరు, విజయవాడ మీదుగా సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతి నుంచి తిరుగు ప్రయాణమై ఈనెల 24న ఉదయం తిరుపతికి చేరుకుంటుంది. టికెట్ ధర రూ.2,500గా నిర్ణయించారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ కోరారు.



పూజలు చేస్తున్న వేదపండితులు

## వేదోక్తంగా లక్ష బిల్వార్చన

శ్రీకాళహస్తీశ్వరాలయంలో లక్ష బిల్వ, కుంకుమార్చను వేదోక్తంగా నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయ అలంకార మండపంలో కార్యక్రమాన్ని రుత్వికులు ప్రారంభించారు. ఆలయ అనువంశిక ప్రధాన అర్చకుడు స్వామినాథన్ గురుకుల్ ఆధ్వర్యంలో మొదట సంకల్ప పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. మధ్యాహ్నం వరకు మూడు కాలాల పాటు అర్చన సాగింది. అనంతరం సాయంత్రం నాలోగ కాలం అర్చన చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు సంబంధం గురుకుల్, ఏఈవో లోకేష్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, వేదపండితులు, అర్చకులు, ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

## గాడిలో పంచాయతీ పాలన

● జిల్లాలో గ్రేడ్-5 కార్యదర్శులు 220 మందికి డీడీవో అధికారాలు

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పాలనను గాడిలో పెట్టడానికి 'కూటమి' ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో 774 పంచాయతీలు ఉండగా అందులో 22 మేజర్. అన్ని పంచాయతీలకు కార్యదర్శులు ఉండేలా చూస్తోంది. సచివాలయ పరిధిలో పనిచేసే గ్రేడ్-5 కార్యదర్శులకు గతంలో డీడీవో అధికారం ఉండేది కాదు. వారికి డీడీవో అధికారాలు ఇవ్వాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. దీంతో జిల్లాలోని సచివాలయాల్లో పనిచేస్తున్న 220 మంది గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు డీడీవో (డ్రాయింగ్ అండ్ డిస్బర్‌మెంట్ ఆఫీసర్) అధికారం ఇస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల నుంచే అమల్లోకి వచ్చింది. తద్వారా వీరికి చెక్ పవర్ రావడంతో పంచాయతీ అభివృద్ధికి అవసరమైన నిధులను డ్రా చేసి వినియోగించే అధికారం ఉంటుంది. దీంతో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు సజావుగా సాగుతాయి. సచివాలయంలో ఉండే గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు డీడీవో అధికారులు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైందని డీపీవో సుశీలా దేవి అన్నారు. తద్వారా చిన్న పంచాయతీల్లోను గ్రామాభివృద్ధికి అవసరమయ్యే నిధులను డ్రా చేసుకునే అవకాశం దక్కుతుందన్నారు.

## హైదరాబాద్ బయల్దేరిన నారా భువనేశ్వరి



నారావారిపల్లెలో భువనేశ్వరికి వీడ్కోలు పలుకుతున్న రవినాయుడు, నరసింహాయాదవ్. శ్రీధర్‌వర్మలు

చంద్రగిరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్ బయలుదేరారు. మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు అంత్యక్రియలకు సీఎం, ఆయన కుటుంబ సభ్యులు ఇటీవల హాజరైన విషయం విదితమే. సీఎం సోమవారం మధ్యాహ్నం అమరావతికి వెళ్లగా భువనేశ్వరి నారావారిపల్లెలో ఉన్నారు. బుధవారం ఆమె రేణిగుంట విమానాశ్రయం నుంచి హైదరాబాదుకు బయలుదేరి వెళ్లారు. ఈసందర్భంగా నారావారిపల్లెలో శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహాయాదవ్, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, గ్రామస్థులు ఆమెకు వీడ్కోలు పలికారు. రామ్మూర్తి నాయుడు కర్మక్రియల నేపథ్యంలో భువనేశ్వరి తిరిగి ఈనెల 25న రానున్నట్లు సమాచారం. కాగా రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు. ఆయన కుమారులు సినీహీరో రోహిత్, గిరీష్‌లను పరామర్శించారు.

● సమీక్షలు- సమావేశాలు

## వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పనులను వేగవంతం చేయండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి, కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి కారిడార్ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. పారిశ్రామికవాడలకు కావాల్సిన నీటి సరఫరా పైపులైన్ పనుల పురోగతిపై ఆరా తీశారు. కార్యక్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ వీరశేఖర్‌రెడ్డి, డిప్యూటీ జోనల్ మేనేజర్ రాంబాబు పాల్గొన్నారు.

### గడువులోగా 'జలజీవన్' పనులు పూర్తి చేయాలి

జలజీవన్ మిషన్ పనులను గడవులోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 2,532 పనుల్లో భాగంగా 1,333 పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులకు సంబంధించి సర్వే కొనసాగుతోందన్నారు. ఈ సర్వేను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కొళాయి కనెక్షన్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. సీపీడబ్ల్యూఎస్ సమగ్ర నీటి పథకం పనులను పూర్తి చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా వంటి పనులను నాణ్యతతో నిర్వహించాలన్నారు. అనంతరం 'మన మరుగుదొడ్డి మన గౌరవం' పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి విజయకుమార్, అన్ని మండలాల ఈఈ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

### రెండు గంటలు ఆలస్యంగా సప్తగిరి ఎక్స్‌ప్రెస్

తిరుపతి(ఆటోనగర్)నవంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుపతి-చెన్నై మధ్య రోజూ రెండు పర్యాయాలు రాకపోకలు సాగిస్తున్న సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బుధవారం రెండు గంటలు ఆలస్యంగా నడిచింది. ఉదయం తిరుపతికి 9.50కు చేరుకుని 10.10 గంటలకు తిరిగి బయలుదేరాల్సి ఉంది. అయితే 12.15 గంటలకు తిరుపతికి చేరుకుని 12.35కు బయలుదేరి వెళ్లింది. తిరిగి తిరుపతికి సాయంత్రం 5.55 గంటలకు చేరుకుని 6.10 గంటలకు బయలుదేరాల్సి ఉన్నా రెండు గంటలు ఆలస్యమైంది. ఈ ఎక్స్‌ప్రెస్‌ను అధికారులు రీషెడ్యూల్ చేశారు.

# కాలుష్యపు కోరల్లో నెర్రికాలువ





నెర్రికాలువలో రంగుమారిన నీళ్లు - సూళ్లూరు వద్ద వాటంబేడుకు వెళ్లే మార్గంలో నెర్రికాలువ పక్కనే పడేసిన వ్యర్థాలు

సూళ్లూరుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలో పంట కాలువల్లో వ్యర్థాలు, మురుగునీరు చేరడంతో సాగునీరంతా కలుషితమవుతోంది. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లో భూములకు సాగు నీరందించే నెర్రికాలువ కాలుష్య కోరల్లో చిక్కుకుంది. సూళ్లూరుపేట పట్టణంలోని ఇళ్లలోని వ్యర్థపునీరు, మురుగుతో పాటు ఇతర వ్యర్థాలు కాలువలోకి చేరుతున్నాయి. దొరవారిసత్రం మండలం తనియాలి వద్ద కాళంగి నదికి అనుసంధానంగా ఉన్న నెర్రికాలువ గుండా కుదిరి, చెరువు కండ్రిగ, డేగలపాలెం, కారిజాత, సూళ్లూరు తదితర 15 చెరువుల ద్వారా దాదాపు 18వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. నెర్రి కాలువ ఆక్రమణకు గురవడంతో పాటు కాలుష్య కోరల్లో చిక్కుకోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సూళ్లూరుపేట పట్టణంలో వాడకనీరంతా కాలువలోకి వదులుతున్నారని పదేళ్ల కిందట రైతులు ఆందోళన చేసిన ఎవరూ పట్టించుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆక్రమణలు తొలిగించి నెర్రికాలువ ఆధునీకరణకు శ్రీకారం చుట్టినా ఆచరణకు నోచుకోలేదు. అనంతరం వైసీపీ ప్రభుత్వం ఆర్భాటాలు చేసినా పనులు మాత్రం చేపట్టలేదు. కోటపోలూరు రైల్వేలైన్ ఆనుకొని ఉన్న పుచ్చాకాలువ పరిస్థితి కూడా అధ్వానంగా ఉంది. ఈ కాలువ ద్వారా కోటపోలూరు, జంగాలపల్లి, ఆబాక గ్రామాల పరిధిలో భూములకు సాగునీరు అందుతోంది. ఇందులోనూ వ్యర్థాలు పేరుకుపోయి సాగునీరు పారక రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి పంట కాలువలను బాగుచేయాలని రైతులు కోరుతున్నారు.

## తాలమ్మ ఆలయంలో చోరీ

### నగలు, నగదు అపహరణ



చోరీ జరిగిన తాలమ్మ ఆలయం

డక్కిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దగ్గవోలు గ్రామంలో వెలసిన తాలమ్మ ఆలయం చోరీ జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు... బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు గ్రామ శివారులో ఉన్న ఆలయం తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. హుండీలో ఉన్న రూ.5 లక్షల మేర నగదు, 1000 గ్రాములు అమ్మవారి వెండి కిరీటం, 500 గ్రాములు వెండికళ్లు, రూ.35 వేలు విలువచేసే అమ్మవారి డైమండ్ ముక్కుపుడక, 20 గ్రాముల 10 బంగారు కాసులు, 15 బంగారు గుండ్లు(15 గ్రాములు), అమ్మవారి మెడలో ఉన్న 12 గ్రాముల బంగారు తాళిబొట్టు, మరో 10 గ్రాముల బంగారు తాళిబొట్టు, 1000 గ్రాముల వెండి వడ్డాణం ఎత్తుకెళ్లారు. ఉదయం గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంకటగిరి సీఐ రమణ, ఇన్‌చార్జి ఎస్‌ఐ నాయక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టారు.

## 'సీలింగ్ భూముల రైతులను ఆదుకుంటాం'



సీలింగ్ రైతుల సమస్యలను తెలుసుకుంటున్న తహసీల్దారు

కోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సాగరమాల రోడ్డు విస్తరణ పనుల్లో సీలింగ్ భూములు కోల్పోయిన రైతులను ఆదుకుంటామని, ఇందులో ఎలాంటి సందేహాలకు తావులేదని తహసీల్దారు జయజయరావు తెలిపారు. మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెంలో బుధవారం సాగరమాల రోడ్డు విస్తరణ పనుల్లో భూములు కోల్పోయిన సీలింగ్ రైతులతో తహసీల్దారు, రెవెన్యూ సిబ్బంది ముఖాముఖి చర్చించారు. నెల్లూరుపల్లి, కొత్తపాళెం, విశ్వనాధం అగ్రహారం గ్రామాల్లోని సీలింగ్ భూములు కోల్పోయినప్పటికీ పరిహారం చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు నివేదించి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మధులత, వీఆర్వో రమణయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మంగళంపాడుకు బస్సు సౌకర్యం కల్పించండి

సూళ్లూరుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి మంగళంపాడుకు బస్సు సౌకర్యం కల్పించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి లోకేష్ ఆధ్వర్యంలో బుధవారం డిపో మేనేజర్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. కొణ్ణంబట్టు, ఇలుపూరు, వెంగలాపురం తదితర గ్రామాల నుంచి 70 మంది విద్యార్థులకు పైగా రోజూ మంగళంపాడు హైస్కూల్‌కు వచ్చివెళుతున్నారని, వీరికి బస్సు సౌకర్యం లేక ఆటోలు, ఇతర వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. గతంలో ఈ మార్గంలో ఉన్న బస్సు సర్వీసును రద్దుచేసి శ్రీకాళహస్తి మార్గంలో నడుపుతున్నారని చెప్పారు. ఆ బస్సును మంగళంపాడు మార్గంలో నడపాలని డిపో మేనేజర్‌ను కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు వరప్రసాద్, నరేంద్ర, చంద్ర పాల్గొన్నారు.

## సామాన్యులకు అండగా టీడీపీ

పెళ్లకూరు, నవంబరు 20,(ఆంధ్రజ్యోతి): టీడీపీ సామాన్యులకు అండగా నిలుస్తుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు దామెర ప్రసాద్‌నాయుడు అన్నారు, బుధవారం మండలంలోని నెలబల్లి పంచాయతీ బీమవరం గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.వంద సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షల ప్రమాద బీమా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్ నాయుడు, అక్కమ నాయుడు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.



## మద్యం బాటిళ్ల స్వాధీనం

వాకాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోట మండలం పుచ్చలపల్లి గ్రామానికి చెందిన షేక్ కాలేషాను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 12 క్వార్టర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వాకాడు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తెలిపారు.

## నిమ్మ సాగుపై అవగాహన

వెంకటగిరి టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్రపల్లి, ముద్దంపల్లి గ్రామాల్లో ఏవో సుజాత ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ చీడ పీడలు తట్టుకుని, నాణ్యమైన దిగుబడిని పొందేందుకు రైతుల వ్యవసాయశాఖ సిబ్బంది సలహాలను పాటించాలన్నారు. భూమిలో నత్రజని వాడకం, కలుపు మొక్కల నివారణపై అవగాహన కలిగి వుండాల న్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



## పాముకాటుతో వ్యక్తి మృతి

బాలాయపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లెమాల గ్రామానికి చెందిన కందాటి రంగయ్య(54) పాముకాటుతో బుధవారం మృతి చెందాడు. కుటుంబసభ్యుల వివరాల మేరకు... బుధవారం వేకువజామున రంగయ్య ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాలిక అదృశ్యం

చిల్లకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం గిరిజన కాలనీకి చెందిన బాలిక తప్పిపోయిందని తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్‌బాబు బుధవారం తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

## విద్యార్థి అదృశ్యం

కోట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని ఎన్‌సీఆర్ నగర్‌కు చెందిన షేక్ రషీద్ అదృశ్యం అయినట్లు అతని తల్లి షేక్ షాజిదా బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రషీద్ రెండు రోజుల క్రితం పాఠశాలకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. చుట్టుపక్కల వారితో పాటు బంధువుల ఇళ్లవద్ద విచారించినప్పటికీ ఆచూకి లభ్యం కాలేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పవన్‌కుమార్ చెప్పారు.

## ప్రయాణికులకు మెరుగైన వసతుల కల్పనకు చర్యలు



రైల్వేప్రొటెక్షన్ ఫోర్స్ కార్యాలయాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న సౌత్‌సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్

గూడూరు అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో ప్రయాణికులకు మెరుగైన వసతులను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. బుధవారం స్థానిక రైల్వే స్టేషన్‌లోని నూతనం ఏర్పాటు చేసిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్లాట్‌ఫాంలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచాలన్నారు. బుకింగ్ కౌంటర్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రైల్వే స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో చీఫ్ కమర్షియల్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, రైల్వేప్రొటెక్షన్ ఫోర్స్ ఐజీ ఆరోమాసింగ్ ఠాగూర్, డీఆర్‌ఎం నాగేంద్రపటేల్, మధుసూదన్‌రావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గురుకులాల జోనల్ క్రీడల్లో పేట విద్యార్థినుల ప్రతిభ



క్రీడల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థినులు

నాయుడుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ గురుకులాల జోనల్‌స్థాయి క్రీడల్లో నాయుడుపేట మండలం పుదూరు గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపినట్లు పిన్సిపాల్ రూత్‌రమోలా బుధవారం తెలిపారు. ప్రకాశం జిల్లా వినుకొండలో 5 రోజుల పాటు అంబేడ్కర్ గురుకులాల జోనల్ స్థాయి క్రీడల్లో నిర్వహించారు. ఇందులో పుదూరు గురుకులంలో సీనియర్ ఇంటర్ చదువుతున్న సుధా 800, 1500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, హైజంప్, 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయస్థానం, సీనియర్ ఇంటర్ చదువుతున్న భార్గవి డిస్కత్రోలో ప్రథమస్థానం, 9వ తరగతి చదువుతున్న భావన 100 మీటర్ల రిలే పరుగు పందెంలో ద్వితీయస్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, 200 మీటర్లల్లో ప్రథమస్థానం, లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానం, 10వ తరగతి చదువుతున్న మహతి 100 మీటర్ల రిలేలో ద్వితీయ స్థానం, 9వ తరగతి చదువుతున్న లాస్య 1500 మీటర్లలో ద్వితీయస్థానం, 10వ తరగతి చదువుతున్న హారిక 100 మీటర్ల రిలేలో ద్వితీయస్థానం సాధించినట్లు తెలిపారు. వీరిని గురుకుల పీఈటీ సుబ్బమ్మ, అధ్యాపకులు శశి, సుభాషిణి అభినందించారు.

## గురుకులాల జోనల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మురళీకృష్ణ, డీపీవోలు

కోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో బుధవారం గురుకులాల జోనల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే పోటీల్లో క్రీడలను అంబేడ్కర్ గురుకులాల రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మురళీకృష్ణ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల డీపీవోలు జయలక్ష్మి, జయ క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. గుంటూరు, ప్రకాశం, ఉమ్మడి నెల్లూరు జిల్లాల్లోని అంబేడ్కర్ గురుకులాలకు చెందిన 17 జూనియర్ కళాశాలలు, 15 గురుకుల పాఠశాలలకు చెందిన 680 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. మొదటి రోజు 100 మీటర్ల పరుగు పందెం, షార్ట్‌పుట్, లాంగ్‌జంప్, డిస్కత్రో పోటీలను ఫిజికల్ డైరెక్టర్లు రాజ్‌కుమార్, శ్రీరేష్ ప్రారంభించారు. స్థానిక ప్రిన్సిపాల్ అదూరు వెంకటేశ్వర్లు, ఎంఈవో దారా మస్తానయ్య, ఎంపీపీ అంజమ్మ, జడ్పీటీసీ కోటయ్య ఎంపీటీసీలు సురేష్, షంషుద్దీన్ క్రీడాకారుల నుంచి క్రీడా వందనం స్వీకరించారు.

## స్వానిధి, స్వాభిమాన్ పక్వా పక్షోత్సవాలపై అవగాహన

గూడూరు అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్వానిధి-టీ, స్వాభిమాన్-టీ పక్వా పక్షోత్సవాలపై బుధవారం సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, క్యూఆర్‌కోడ్ వంటి వాటిపై వీధి వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. పీఎం స్వానిధి పథకం ద్వారా మొదటి విడతలో రూ.10వేలు, తరువాత రూ.20వేల రుణాలను పొందవచ్చునన్నారు. రుణాలను తిరిగి చెల్లిస్తే రూ.50వేల వరకు రుణాలు పొందవచ్చువన్నారు. కార్యక్రమంలో ఏపీజీబీ బ్యాంకు జిల్లా కోఆర్డినేటర్ గురుస్వామి, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ పెంచలయ్య, సీఈవో చందన, సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

## విపత్తుల సమయంలో అప్రమత్తతే కీలకం



ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందంతో తహసీల్దారు నరసింహారావు, సీఐ మురళీకృష్ణ, ఎంపీడీవో ప్రమీలారాణి తదితరులు

సూళ్లూరుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విపత్తుల సమయంలో అధికారుల అప్రమత్తతే కీలకమని ఎన్‌డీఆర్‌ఎఫ్ ఎస్‌ఐ సుమన్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం ఆధ్వర్యంలో వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విజయవాడకు చెందిన ఎన్‌డీఆర్‌ఎఫ్ ఎస్‌ఐ సుమన్ కుమార్ మాట్లాడుతూ వరదలు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలలో అధికారులకు క్షుణ్ణంగా వివరించారు. విపత్తులు సంభవించినప్పుడు ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై గురువారం కోటపోలూరు చెరువులో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందంచే రిహార్సల్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహారావు, ఎంపీడీవో ప్రమీలారాణి, సీఐ మురళీకృష్ణ, వైద్యాధికారి రమణయ్య, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఏరియా ఆస్పత్రికి వీల్‌చైర్ అందజేత

గూడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రికి శ్రీకృష్ణసేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ సహకారంతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వీల్‌చైర్‌ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే గర్భిణులను, కాన్పులు చేయించుకున్న వారిని వార్డుకు తీసుకువెళ్లేందుకు సౌకర్యంగా వీల్‌చైర్‌ను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, మునిగిరీష్, దశరధరామిరెడ్డి, పీవీకృష్ణయ్య, ఎన్‌వీరత్నం, రాంప్రసాద్, ఎస్‌వీఎన్ ప్రసాద్, వెంకటేశ్వర్లురెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ షరీనా తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా శ్రీకృష్ణసేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక గమళ్లపాళెంలోని సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో, షైఫ్రెండ్స్ అసోసియేషన్ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో మహేశ్వరి, ఉషా, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

## చిట్టేడులో పొలం పిలుస్తోంది

కోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు, రుద్రవరం గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయ అధికారి నిరంజన్‌కుమార్ ఆధ్వర్యంలోపొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వేరుశనగ పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. వరి సాగు చేస్తున్న రైతులు ఎకరానికి రూ.630, వేరుశనగ పంట ఎకరానికి రూ.450 ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు భూషణ్, ప్రశాంతి, సురేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## పంటల బీమాతో అన్నదాతలకు ధీమా

ఓజిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దిగుబడి చేతికి వచ్చే సమయంలో ఎదురౌతున్న ప్రకృతి విపత్తుల నేపథ్యంలో రైతులు తమ పంటలకు బీమా చేసుకోవడం ద్వారా ధీమాగా ఉండొచ్చని ఏవో విజయలక్ష్మి అన్నారు. ఓజిలి మండలం రాచపాళెం, ఓజిలి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని రైతులకు పంటలసాగు, ఎరువులు, పురుగు మందుల వాడకం, చీడపీడల నివారణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే పంటల బీమా ప్రాముఖ్యం, రైతులకు ప్రభుత్వ అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ధనుంజయ, రైతులు వెంకటరమణారెడ్డి, శీనయ్య పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో సిబ్బందిని నియమించండి

గూడూరు అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గూడూరు మున్సిపాలిటీలో సిబ్బందిని నియమించాలని బుధవారం రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ హరికృష్ణకు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. బుధవారం గుంటూరులో హరికృష్ణను కలిసిన ఎమ్మెల్యే గూడూరు మున్సిపాటిలో సిబ్బంది కొరత గురించి వివరించారు. కార్యాలయంలో డిప్యుటేషన్ లేదా రెగ్యులర్ సిబ్బందిని నియమించాలని కోరారు.

## తీర ప్రాంతాల అభివృద్ధికి నిధులు మంజూరు పట్ల హర్షం

గూడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని తీరప్రాంత గ్రామాల అభివృద్ధికి రూ.4.14 కోట్లు మంజూరు చేయడం పట్ల ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని చిల్లకూరు మండలం తమ్మినపట్నం పంచాయతీ గమ్మళ్లదిబ్బ నుంచి బీచ్ వరకు బీటీ రోడ్డుకు రూ.3.11, వాకాడు మండలం జమీన్‌కొత్తపాళెం పంచాయతీ తూపిలిపాళెం గ్రామం నుంచి బీచ్ వరకు బీటీ రోడ్డుకు రూ.66 లక్షలు, దుగరాజపట్నం పంచాయతీ కొండూరుపాళెం గ్రామం నుంచి బీచ్ వరకు బీటీ రోడ్డుకు రూ.37 లక్షలు మంజూరు చేశారన్నారు. ఇందుకు సీఎం చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్టీసీ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

వాకాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వాకాడు ఆర్టీసీ డిపో వద్ద ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ (సీఐటీయూ) పిలుపు మేరకు కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ సెక్రటరీ షేక్ వజీర్‌బాషా మాట్లాడుతూ నైట్‌హాస్, డేహాస్ అలవెన్స్‌లు, టీఏ బిల్లుల చెల్లింపులు, 2019 సర్క్యులర్ అమలు, 12వ పీఆర్‌సీ అమలు, పెండింగ్ డీఏలు విడుదల, లివెన్ కాన్స్మెంట్‌లు చెల్లింపు, ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లకు గుర్తింపుకార్డులు, గ్యారేజ్ కార్మిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ బలరామయ్య, కార్యదర్శి పీడీ రమణయ్య తదితర కార్మికులు పాల్గొన్నారు.

## ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

తడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. తడ, వేనాడులోని గ్రంథాలయాలలో ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమాల్లో గ్రంథాలయ అధికారి కల్యాణి, వేనాడు ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంత కుమారి పాల్గొన్నారు.

## పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

నాయుడుపేట టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి గణేష్ అన్నారు. మండలంలోని విన్నమాల, కారువారి మంచికండ్రిగ గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పంటల వద్దకెళ్లి రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పంటల బీమా పథకాన్ని అమలు పరుస్తున్నారని తెలిపారు. డిసెంబరు 31వ తేదీ లోగా రైతులు మీసేవా కేంద్రం, సీఎస్‌సీ సెంటర్లు, బ్యాంకుల ద్వారా ఎకరాకు వరి పంటకు రూ.630 ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవచ్చన్నారు. ఈ పథకం వలన తుఫాన్లు, కరువు, అకాల వర్షాలు వచ్చినప్పుడు రైతులకు ఆర్థికసాయం అందుతుందన్నారు.

## గంగ కాలువ ఆక్రమణపై ఫిర్యాదు



ఆక్రమణకు గురైన కాలువను పరిశీలిస్తున్న గంగ అధికారులు

చిట్టమూరు, నవంబర్ 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యాకసిరి పాటిమిట్ట గ్రామంలో ఓ భూస్వామి తెలుగుగంగ కాలువ ఆక్రమించి తంతి లాగారని రైతులు తెలుగుగంగ ఉన్నతాధికారులకు బుధవారం ఫిర్యాదు చేశారు. యాకసిరి, తన్నమాలకు వెళ్లే తెలుగుగంగ కాలువ నుంచి ఓ భూస్వామి మట్టి అక్రమంగా తరలించారని తెలిపారు. అంతేకాక కాలువ కట్టను ఆక్రమించి తంతి లాగేసి రైతులను పొలాల్లోకి వెళ్లకుండా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తెలుగుగంగ ఏఈ పూర్ణచంద్రరావు ఆక్రమణకు గురైన గంగ కాలువను పరిశీలించారు. ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకొని తంతిని తొలగించాలని రైతులు అధికారులను కోరారు.

## పుస్తక పఠనంతో విజ్ఞానం

సూళ్లూరుపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌ఎల్‌బీ శంకర్ శర్మ అన్నారు. స్థానిక వీఎస్‌ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల గ్రంథాలయంలో దాదాపు 17వేలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వకృత్వ, వ్యాసరచన పోటీలు, క్విజ్ నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, గ్రంథాలయ అధికారి కే.రమేష్, జాక్ కోఆర్డినేటర్ వీబీ.రాజా అధ్యాప కులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు



అక్రమణలను పరిశీలిస్తున్న ఒకటో పట్టణ సీఐ శేఖర్‌బాబు

గూడూరు అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోడ్డు మార్జిన్‌లో దుకాణాలను ఏర్పాటు చేసుకున్న అక్రమణదారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఒకటో పట్టణ సీఐ శేఖర్‌బాబు అన్నారు. బుధవారం పట్టణంలోని రైల్వేస్టేషన్ నుంచి ఐసీఎస్ రోడ్డు, సంగం థియేటర్ ప్రాంతాల్లో అక్రమణలను మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రోడ్డు పక్కన అక్రమణల వల్ల ట్రాఫిక్ సమస్యలు ఎదురువుతున్నాయన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

వెంకటగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని విశ్వోదయ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ విజయ శేఖర్ అన్నారు. బుధవారం కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.